# శుభోదయం

ప్రతీ అక్షరం..ప్రజా సమరం......!

WWW.SUBHODAYAMDAILY.COM

తెలంగాణ | సంపుటి : 2 | సంచిక : 285 | ఎడిటర్ : వి. శ్రీనివాసరావు | పేజీలు :8 | మంగళవారం 6 జనవరి 2026




## బియ్యం ఉత్పత్తిలో మనమే నెంబర్ వన్

- చైనాను దాటేసిన భారత్
- ప్రపంచంలోనే అతిపెద్ద బియ్యం ఉత్పత్తిదారుగా భారత్
- 184 కొత్త పంట వంగడాలను విడుదల చేసిన కేంద్ర ప్రభుత్వం
- దిగుబడి పెంచే విత్తనాల అభివృద్ధిలో కీలక ముందడుగు
- పప్పులు, నూనె గింజల ఉత్పత్తి పెంచాలని శాస్త్రవేత్తలకు సూచన

# మధ్యవర్తిత్వంతో పరిష్కరించుకోండి

- పోలవరం-నల్లమల్లసాగర్ ప్రాజెక్ట్‌పై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు
- తదుపరి విచారణను వచ్చే సోమవారానికి వాయిదా
- సమగ్ర విచారణ కోసం సివిల్ సూట్ ఫైల్ చేయమని సూచన
- కేంద్ర ప్రభుత్వ కమిటీకి తెలంగాణ ప్రభుత్వ అభ్యర్థనలను పరిశీలించి, అవసరమైతే ప్రాజెక్టును ఆపే నిర్ణయాధికారాన్ని ఇస్తాం.
- మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించుకుని అవకాశం ఇచ్చారు



ఢిల్లీ

పోలవరం-నల్లమల్లసాగర్ ప్రాజెక్ట్ విషయంలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రాజెక్ట్‌పై మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించుకునేందుకు ప్రయత్నించండి అంటూ ఏపీ, తెలంగాణ రాష్ట్రాలకు సూచించారు. అనంతరం, కేసు తదుపరి విచారణను వచ్చే సోమవారానికి వాయిదా చేశారు. కాగా, నిబంధనలకు విరుద్ధంగా చేపట్టిన పోలవరం-నల్లమల సాగర్ ప్రాజెక్టుపై స్టే ఇవ్వాలని తెలంగాణ ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది అభిషేక్ సింఘ్వీ కోరారు. ఈ ప్రాజెక్టుతో గోదావరిలో తమ వాటా తగ్గుతుందని తెలంగాణ ప్రభుత్వం వాదిస్తోంది. ఈ నేపథ్యంలో ప్రాజెక్ట్‌కు సంబంధించి మూడు పరిష్కారాలను సుప్రీంకోర్టు సూచించింది. సమగ్ర విచారణ కోసం సివిల్ సూట్ ఫైల్ చేయమని సూచన కేంద్ర ప్రభుత్వ కమిటీకి తెలంగాణ ప్రభుత్వ అభ్యర్థనలను పరిశీలించి, అవసరమైతే ప్రాజెక్టును ఆపే - మిగతా3లో



# కవిత కొత్త పార్టీ జాగృతి!

- రాజకీయంగా అందరూ మద్దతు ఇవ్వండి
- త్వరలోనే పార్టీ విధివిధానాలను ప్రకటిస్తా
- ఇంటి పార్టీ నుంచి అవమాన భారంతో బయటకు వస్తున్నా
- గొప్ప రాజకీయ శక్తిగా ఎదుగుతాం.. సమస్యలపై పోరాడుతాం

హైదరాబాద్

ఎమ్మెల్సీ కవిత కొత్త పార్టీ పెట్టబోతున్నారా? అంటే అవుననే సమాధానం చెప్పారు కవిత. సోమవారం నాడు శాసనమండలి నుంచి బయటకు వచ్చిన తరువాత గన్‌పార్క్ వద్ద మీడియాతో మాట్లాడారు కవిత. కొత్త పార్టీ పెట్టబోతున్నట్లు ప్రకటించారు. తన నేతృత్వంలో నడుస్తున్న జాగృతి సంస్థనే కొత్త పార్టీగా - మిగతా3లో



## అమెరికా నిర్బంధంలో వెనెజువెలా అధ్యక్షుడు...

- ఘాటుగా స్పందించిన చైనా
- ఇతర దేశాల సార్వభౌమత్వాన్ని అమెరికా ఉల్లంఘిస్తోందన్న చైనా విదేశాంగ మంత్రి
- ఏ దేశానికి అంతర్జాతీయ జడ్జిగా వ్యవహరించే అర్హత లేదని వ్యాఖ్య
- బలప్రయోగాన్ని చైనా ఎప్పుడూ సమర్థించదన్న వాంగ్ యీ


## సముద్ర ప్రతాప్ నౌక జలప్రవేశం



- నౌకా నిర్మాణం, మారిటైం సామర్థ్యం కలిగిన దేశాల్లో భారత్ ఓ కీలక అడుగు
- సముద్ర ప్రతాప్ నౌకను గోవా షిప్‌యార్డు సంస్థ నిర్మించింది
- సుమారు 60 శాతం స్వదేశీ పరిజ్ఞానంతో సముద్ర ప్రతాప్‌ను తయారు చేశారు
- మారిటైం పొల్యూషన్, ఫైర్ ఫైటింగ్, సముద్ర , పర్యావరణ రక్షణతో పాటు కోస్తా తీర ప్రాంతాల్లో పెట్రోలింగ్ నిర్వహించనున్నది

## అత్యాచారం కేసులో దోషి.. పెరోల్‌పై 15వ సారి బయటకు వచ్చిన డేరా బాబా

- 40 రోజుల పెరోల్ పొందడంతో సునారియా జైలు నుంచి బయటకొచ్చిన గుర్మీత్
- 2017లో దోషిగా తేలినప్పటి నుంచి 15వసారి పెరోల్
- సిర్సాలోని డేరా ప్రధాన కార్యాలయంలో ఉంటాడని గుర్మీత్ అధికార ప్రతినిధి వెల్లడి



# ప్రత్యేక యాప్‌ల ద్వారా మోసాలు

- ప్రత్యేక యాప్‌లతో గాలం వేస్తున్న సైబర్ మోసగాళ్లు
- ఆన్‌లైన్ బెట్టింగ్‌కు బలైపోతున్న యువత
- ఆన్‌లైన్ బెట్టింగ్ వల్ల ప్రాణాలు బలి తీసుకుంటున్న యువకులు
- ప్రత్యేక యాప్‌ల బెట్టింగులతో యువతకు గాలం
- రూ.లక్షల్లో డబ్బులు కొట్టేస్తున్న సైబర్ నేరగాళ్లు



హైదరాబాద్

లైన్ బెట్టింగ్ యువత ప్రాణాలు తీస్తోంది. ప్రతి ఒక్కరు సులువుగా డబ్బు సంపాదించేందుకు ఆశపడతారు. అందులో భాగంగా కొందరు యువత ఆన్‌లైన్ పందేలకు ఆకర్షితులై రూ.లక్షలు పోగొట్టుకుంటున్నారు. ఆ తర్వాత అవమాన భారంతో ప్రాణాలు తీసుకుంటున్నారు. ఒకదాని వెంట ఒకటి బెట్టింగ్, గేమింగ్ ఇలా పేరు ఏదైనా ఆన్‌లైన్ ఆటలు వారి ప్రాణాల మీదకు తెస్తున్నాయి. ఇలా అడ్డదారుల్లో డబ్బు సంపాదించాలి, రాత్రికి రాత్రే సంపన్నులు అవ్వాలనే అత్యాశ వల్ల చివరికి రూ.వేలు, రూ.లక్షలు - మిగతా3లో



## ఈ ప్రపంచం డొనాల్డ్ ట్రంప్ ముందు మోకరిల్లదు

- అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఈ ప్రపంచంలోని జనాభాను భయపెట్టే ప్రయత్నం చేస్తున్నాడు.
- ఎవరు రాజ్య విస్తరణకు ప్రయత్నించినా దాన్ని ఎక్కువ కాలం కొనసాగించలేరు
- హిట్లర్, ముస్సోలినీ లాంటి వాళ్లు కూడా అలాంటి ప్రయత్నాలు చేసి కనుమరుగై పోయారు
- కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే

# కవిత ఆరోపణలు.. చర్యలు తీసుకోని సీఎం

- టీ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు
- రాజకీయ పార్టీ పెట్టే స్వేచ్ఛ అందరికీ ఉంటుంది
- బీఆర్ఎస్, హరీష్‌రావు, కేటీఆర్‌పై కవిత ఆరోపణల ఆధారంగా ఎందుకు చర్యలు తీసుకోవట్లేదు
- కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య అంతర్గత ఒప్పందం కుదిరింది



హైదరాబాద్

తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత పార్టీ స్థాపించే అంశం ఆమె వ్యక్తిగతమని టీ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు తెలిపారు. సోమవారం హైదరాబాద్‌లో తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రాంచందర్ రావు మాట్లాడుతూ.. రాజకీయ పార్టీ పెట్టే స్వేచ్ఛ అందరికీ ఉంటుందని పేర్కొన్నారు. బీఆర్ఎస్, హరీష్‌రావు, కేటీఆర్‌పై కవిత ఆరోపణల ఆధారంగా ఎందుకు చర్యలు తీసుకోవట్లేదంటూ సీఎం రేవంత్ రెడ్డిని ఆయన సూటిగా ప్రశ్నించారు. అందుకు సంబంధించిన ఆధారాలు ఇవ్వడానికి కవిత సిద్ధంగా ఉన్నా.. చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వం సిద్ధంగా లేదన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య అంతర్గత ఒప్పందం కుదిరిందని ఆయన పేర్కొన్నారు. బీఆర్ఎస్‌ను కాపాడుతోంది.. - మిగతా3లో

# చరిత్ర సృష్టించనున్న సిద్ధరామయ్య!



**బెంగళూరు:** కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య సరికొత్త రికార్డు సృష్టించనున్నారు. జనవరి ఆరు రేపటితో అత్యధిక కాలం ఆ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా పనిచేసిన వ్యక్తి రికార్డును ఆయన సమం చేయనున్నారు. ఆ తరువాత రోజుతో అధిక కాలం పనిచేసిన వ్యక్తిగా కొత్త రికార్డు సృష్టించనున్నారు. ఈ నేపథ్యంలో కర్ణాటకలో ముఖ్యమంత్రి అనుచరులు, శ్రేయోభిలాషులు సంబురాలు చేసుకుంటున్నారు. కొద్ది రోజుల క్రితం కర్ణాటకలో ముఖ్యమంత్రి పీఠం కోసం జరిగిన హంగామా అంతా ఇంతా కాదు. ఆ రాష్ట్ర సీఎం సిద్ధరామయ్య, డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ ఇద్దరూ సీఎం కుర్చీ కోసం పోటీపడ్డారు. ఈ నేపథ్యంలో హైకమాండ్ ఎంట్రీతో ప్రస్తుతానికి ఆ విషయం సద్దుమణిగింది. అయితే ఇదిలా ఉండగా ప్రస్తుతం సిద్ధరామయ్య సరికొత్త రికార్డు సృష్టించనున్నారు. రేపటితో అత్యధిక కాలం సీఎంగా పనిచేసిన కాలాన్ని సమం చేసిన ఆయన... ఎల్లుండితో ఆ రికార్డు బద్దలు కొట్టనున్నారు. ఆ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి డి. దేవరాజ్ ఉర్స్ ఇంతకాలం వరకూ అక్కడ అధిక కాలం ముఖ్యమంత్రిగా పనిచేసిన వ్యక్తిగా ఉన్నారు. ఆయన 1972-77, 1978-80 కాలంలో సీఎంగా కర్ణాటకకు సేవలంధించారు. మెత్తంగా ఆయన 7సంవత్సరాల 239రోజులు ముఖ్యమంత్రిగా పనిచేశారు. అయితే రేపటితో సిద్ధరామయ్య ఆరికార్డును సమం చేస్తారు. 2013-18తో పాటు 2023నుంచి ఆయన సీఎంగా కొనసాగుతున్నారు. దీంతో జనవరి ఏడుతో అత్యధిక కాలం కర్ణాటకకు సీఎంగా పనిచేసిన వ్యక్తిగా ఆయన రికార్డు సృష్టించనున్నారు. అయితే ఈ రికార్డుపై సిద్ధరామయ్య స్పందించారు... "ప్రజల ప్రేమ ఆశీర్వాదం వల్లే ఇంతకాలం పాటు ముఖ్యమంత్రిగా సేవలంధించా, రాజకీయాల్లోకి ప్రవేశించేటప్పుడు మంత్రి, ముఖ్యమంత్రిగా సేవలంధిస్తానని నేను అనుకోలేదు. కేవలం ఎమ్మెల్యేగా గెలవాలనుకున్నాను". అని సిద్ధరామయ్య అన్నారు. ఇప్పటివరకూ తాను మెత్తం 13 ఎన్నికల్లో పోటీచేస్తే ఎనిమిది ఎన్నికల్లో గెలిచానని తెలిపారు. తొలిసారి తాను ఎన్నికల్లో పోటీ చేసినప్పుడు ప్రజలే తనకు నిధులు సమకూర్చి గెలిపించారన్నారు. సచిన్ రికార్డును విరాట్ కోహ్లీ బద్దలుగొట్టినట్లుగా తాను వాటిని అధిగమించానని సిద్ధరామయ్య సరదాగా అన్నారు.

# సముద్ర ప్రతాప్ నౌక జలప్రవేశం



పనాజీ: భారతీయ కోస్టు గార్డుకు చెందిన సముద్ర ప్రతాప్ నౌక ఇవాళ జలప్రవేశం చేసింది. గోవాలో జరిగిన కార్యక్రమంలో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పాల్గొన్నారు. సముద్ర ప్రతాప్‌ను పొల్యూషన్ కంట్రోల్ వెసల్‌గా వర్ణిస్తున్నారు. ఈ నౌకను స్వదేశీయంగా తయారు చేశారు. నౌకా నిర్మాణం, మారిటైం సామర్థ్యం కలిగిన దేశాల్లో భారత్ ఓ కీలక అడుగు వేసింది. సముద్ర ప్రతాప్ నౌకను గోవా షిప్‌యార్డు సంస్థ నిర్మించింది. సుమారు 60 శాతం స్వదేశీ పరిజ్ఞానంతో సముద్ర ప్రతాప్‌ను తయారు చేశారు. ఇండియన్ కోస్టు గార్డు వద్ద ఉన్న నౌకల్లో సముద్ర ప్రతాప్ అతిపెద్ద నౌకగా గుర్తింపు తెచ్చుకున్నది. మారిటైం పొల్యూషన్, ఫైర్ ఫైటింగ్, సముద్ర , పర్యావరణ రక్షణతో పాటు కోస్తా తీర ప్రాంతాల్లో పెట్రోలింగ్ నిర్వహించనున్నది. మారిటైం సవాళ్లను ఎదుర్కొనే రీతిలో సముద్ర ప్రతాప్ యుద్ధనౌకను తయారు చేసినట్లు మంత్రి రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు. స్వదేశీ పరిజ్ఞానంతో తయారు చేసే నౌకల్లో 90 శాతం స్వంత వస్తువులను వాడే రీతిలో ప్రయత్నాలు జరుగుతున్నట్లు ఆయన చెప్పారు. ప్రాథమికంగా పొల్యూషన్ కంట్రోల్ కోసం దీన్ని డిజైన్ చేశామన్నారు. సముద్ర పర్యారవణ రక్షణ వ్యూహాత్మక అవసరమని, నైతిక బాధ్యత అని ఆయన అన్నారు. అడ్వాన్స్‌డ్ ఎన్విరాన్మెంటల్ రెస్పాన్స్ సామర్థ్యం ఉన్న దేశాల్లో ఇప్పుడు ఇండియా కూడా అగ్రభాగాన నిలుస్తుందని మంత్రి అన్నారు. సముద్రాలు స్వచ్ఛంగా ఉంటే, వాణిజ్యం సురక్షితంగా సాగుతుందన్నారు. ఇండో పసిఫిక్ ప్రాంతంలో శాంతియుత, స్థిరమైన మారిటైం ఎన్విరాన్మెంట్ కోసం పాటుపడుతున్నట్లు చెప్పారు. సముద్ర ప్రతాప్ నౌక సుమారు 114.5 మీటర్ల పొడుగు ఉంటుంది. 4200 టన్నులు బరువు ఉన్నది. సుమారు 22 నాట్ల వేగంతో ఇది ప్రయాణిస్తుంది.

# స్థానికంగా బలపడుతోన్న కమలం



**న్యూఢిల్లీ :** భారతీయ జనతాపార్టీ.. ప్రపంచంలో అత్యధిక సభ్యంత్వం కలిగిన పార్టీ. 12 ఏళ్లుగా దేశంలో అధికారంలో ఉంది. ఉత్తరాది పార్టీగా పదేళ్ల క్రితం వరకు బీజేపీకి ముద్ర ఉండేది. కానీ తర్వాత దక్షిణాదిన కూడా పాగా వేసింది. మహారాష్ట్ర, కర్ణాటకలో అధికారంలోకి వచ్చింది. కేరళ, తెలంగాణ, తమిళనాడులో పాగా వేయాలని ప్రయత్నిస్తోంది. ఇదిలా ఉంటే.. దక్షిణాదిలో బీజేపీ అర్బన్ పార్టీగానే గుర్తింపు ఉంది. కానీ 2025 డిసెంబర్‌లో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటింది. ప్రతిపక్ష కాంగ్రెస్‌ను వెనక్కి నెట్టింది. ప్రాంతీయ పార్టీలను మించి సీట్లు గెలిచింది. దీంతో క్షేత్రస్థాయిలో పార్టీ బలపడుతోందన్న సంకేతాలు వస్తున్నాయి. మహారాష్ట్ర, కేరళ, కర్ణాటక, గోవా, అరుణాచల్ ప్రదేశ్‌లో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో మెజారిటీ స్థానాల్లో విజయం సాధించింది.

**మహారాష్ట్రలో..**

మహారాష్ట్రలో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో 117 స్థానాలతో ముందంజలో నిలిచింది. మిత్ర పక్షాలు ఈకనాథ్ శిండే శివసేన, అజిత్ పవార్ ఎన్‌సీపీ కలిసి 200+ సీట్లు సాధించాయి. మహాఘట్‌బంధన్‌కు 37 మాత్రమే వచ్చాయి. ఈ మైత్రి విజయం బీజేపీ దక్షిణ, పశ్చిమ రాష్ట్రాల్లో బలపడుతుందనడానికి నిదర్శనం.

**కర్ణాటకలో అధికార పార్టీకి షాక్..**

కాంగ్రెస్ పాలిత కర్ణాటకలో పట్టణ స్థానిక సంస్థల్లో బీజేపీ 40 సీట్లతో ఆధిక్యం చెప్పింది. కాంగ్రెస్ 23, జేడీఎస్ ఒకటి, స్వతంత్రులు 2 మాత్రమే గెలిచారు. అధికార పార్టీని కాదని అక్కడి ఓటర్లు బీజేపీకి స్థానిక సంస్థల్లో అవకాశం కల్పించారు.

**గోవాలో..**

ఉత్తరాది రాష్ట్రం గోవాలో పంచాయతీ ఎన్నికలు జరిగాయి. ఇక్కడ బీజేపీ?మహారాష్ట్రవాది గోమంతక్ పార్టీ కూటమి 32 సీట్లు సాధించింది. కాంగ్రెస్ 10, ఆప్ 1, స్వతంత్రులు 4. అధికార బీజేపీ స్థానిక స్థాయిలో బలపడినట్టు నిదర్శనం.

**అరుణాచల్ ప్రదేశ్..**

అరుణాచల్‌లో జిల్లా కౌన్సిల్‌లో బీజేపీ 170 సీట్లు, పంచాయతీల్లో 6,085 సీట్లు గెలిచాయి. పీపీఏ 648, ఎన్‌పీపీ 160, స్వతంత్రులు 627, కాంగ్రెస్ 216 గెలిచాయి. ఈశాన్య రాష్ట్రంలో బీజేపీ ఆధిపత్యం పెరగడం గమనార్హం.

**కేరళలో..**

కేరళ పంచాయతీల్లో యూడీఎఫ్ 505, ఎల్‌డీఎఫ్ 345, స్వతంత్రులు 64, బీజేపీ 26 సీట్లు గెలిచాయి. తిరువనంతపురం మున్సిపాలిటీలో బీజేపీ గణనీయ పురోగతి చెందింది. గతంతో పోలిస్తే చాలా పంచాయతీల్లో బీజేపీ విజయం షాధించింది. ఈ ఎన్నికలు బీజేపీ అట్టడుగుస్థాయి బలాన్ని చూపుతున్నాయి. అధికారంలో లేని రాష్ట్రాల్లో కూడా బీజేపీ బలపడింది. 2024 లోక్‌సభ తర్వాత పార్టీ స్థానిక స్థాయిలో దృష్టి పెట్టి, దక్షిణ?ఈశాన్యంలో పట్టు పెంచుకుంది. తెలంగాణలో కూడా ఇదే ట్రెండ్ కొనసాగుతోంది.

## ప్రపంచంలోనే అత్యంత భారీ శివలింగం.. మధ్యలోనే నిలిచిపోయిన ప్రయాణం



ప్రపంచంలోనే అతిపెద్దదైన, అత్యంత బరువైన శివలింగం ప్రయాణం మధ్యలోనే నిలిచిపోయింది. తమిళనాడులోని మహాబలిపురంలో తయారైన శివలింగం అదివారం ఉదయం బీహార్‌లోని గోపాల్‌గంజ్‌కు చేరుకుంది. గోపాల్‌గంజ్‌లో గండక్ నది (నారాయణి నది) పై ఉన్న వంతెన శిథిలావస్థకు చేరడంతో ఆ భారీ శివలింగాన్ని తరలించడం అక్కడి అధికారులకు పెద్ద సవాల్‌గా మారింది. ఈ భారీ శివలింగం బరువు సుమారు 210 టన్నులు కాగా.. దీనిని తరలిస్తున్న 106 చక్రాల ప్రత్యేక ట్రైలర్ (లారీ) బరువు మరో 160 టన్నులు. ఈ రెండింటి మొత్తం బరువును ఆ వంతెన మోయలేదని నిపుణులు చెబుతున్నారు. వంతెనపై చాలాచోట్ల పగుళ్లు ఉన్నట్లు ప్రాథమిక తనిఖీల్లో గుర్తించడంతో భద్రతాపరమైన ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఈ క్రమంలో పరిస్థితిని సమీక్షించేందుకు జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ, బీహార్ రాజ్యపుల్ నిర్మాణ్ నిగమ్ లిమిటెడ్ బృందాలను పిలిపించినట్లు జిల్లా కలెక్టర్ పవన్ కుమార్ సిన్హా తెలిపారు. బీహార్ మంత్రి అశోక్ చౌదరి కూడా గోపాల్‌గంజ్‌కు వచ్చి వంతెనను స్వయంగా పరిశీలించనున్నా రు. వారి పరిశీలన అనంతరం శివలింగం తరలింపుపై క్లారిటీ వచ్చే అవకాశం ఉంది. కాగా ఈ మహా శివలింగాన్ని తూర్పు చంపారన్ జిల్లా కేంద్రమైన మోతిహారిలోని విరాట్ రామాయణ్ ఆలయానికి తరలించాల్సి ఉంది. ఈ భారీ వాహనం మహాబలిపురం నుంచి 3,178 కిలోమీటర్ల దూరం ప్రయాణించి 32 రోజుల్లో ఈ వాహనం గోపాల్‌గంజ్‌కు చేరుకుంది. శివలింగం తూర్పు చంపారన్ చేరుకోవడానికి మరో రెండు ప్రత్యామ్నాయ మార్గాలు ఉన్నప్పటికీ, వాటి పరిస్థితి సంతృప్తికరంగా లేదని అధికారులు చెబుతున్నారు. ఒక మార్గంలోని వంతెన సామర్థ్యం సరిపోదని, మరో మార్గంలో కూడా అనేక చిన్న వంతెనలు, కల్వర్టులు ఉండటం తో భారీ వాహనం ప్రయాణించడం కష్టమని భావిస్తున్నారు. దాంతో శివలింగాన్ని సురక్షితంగా గమ్యస్థానానికి చేర్చేందుకు అధికారులు అన్ని మార్గాలను అన్వేషిస్తున్నారు.

## బియ్యం ఉత్పత్తిలో మనమే నెంబర్ వన్



బియ్యం ఉత్పత్తిలో భారత్ సరికొత్త రికార్డు సృష్టించింది. ఇప్పటివరకు అగ్ర స్థానంలో ఉన్న చైనాను అధిగమించి ప్రపంచంలోనే అతిపెద్ద బియ్యం ఉత్పత్తిదారుగా అవతరించింది. ఈ విషయాన్ని కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ సోమవారం ఢిల్లీలో వెల్లడించారు. భారత్ 150.18 మిలియన్ టన్నుల బియ్యాన్ని ఉత్పత్తి చేయగా, చైనా ఉత్పత్తి 145.28 మిలియన్ టన్నులకే పరిమితమైందని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా భారత వ్యవసాయ పరిశోధన మండలి (ఐసీఏఆర్) అభివృద్ధి చేసిన 25 రకాల పంటలకు చెందిన 184 కొత్త వంగడాలను మంత్రి విడుదల చేశారు. అధిక దిగుబడినిచ్చే విత్తనాల అభివృద్ధిలో భారత్ గొప్ప విజయం సాధించిందని, ఇప్పుడు ప్రపంచ మార్కెట్లకు బియ్యాన్ని ఎగుమతి చేసే ప్రముఖ దేశంగా మారిందని అన్నారు. ఈ కొత్త వంగడాలను సాధ్యమైనంత త్వరగా రైతులకు చేరేలా చూడాలని అధికారులను ఆదేశించారు. దేశాన్ని స్వయం సమృద్ధిగా మార్చేందుకు పప్పుధాన్యాలు, నూనె గింజల ఉత్పత్తిపై దృష్టి పెట్టాలని వ్యవసాయ శాస్త్రవేత్తలకు మంత్రి సూచించారు. ప్రధాని మోదీ ప్రభుత్వ హయాంలోని గత 11 ఏళ్లలో 3,236 అధిక దిగుబడినిచ్చే వంగడాలకు ఆమోదం తెలిపినట్లు గుర్తుచేశారు. వాతావరణ మార్పులు, కరవు, నేలల లవణీయత వంటి సవాళ్లను తట్టుకునేలా ఈ కొత్త వంగడాలను రూపొందించినట్లు వివరించారు. ఒకప్పుడు ఆహార కొరత ఎదుర్కొన్న భారత్, ఇప్పుడు ప్రపంచ దేశాలకు వ్యవసాయ ఉత్పత్తులను సరఫరా చేసే స్థాయికి చేరిందని చౌహాన్ హర్షం వ్యక్తం చేశారు. ఐసీఏఆర్, వ్యవసాయ విశ్వవిద్యాలయాలు, ప్రైవేట్ విత్తన కంపెనీల సమిష్టి కృషితోనే ఈ విజయం సాధ్యమైందని ఆయన తెలిపారు.

## అత్యాచారం కేసులో దోషి.. పెరోల్‌పై 15వ సారి బయటకు వచ్చిన డేరా బాబా



డేరా సచ్చా సౌదా అధిపతి గుర్మీత్ రామ్ రహీమ్ సింగ్ 40 రోజుల పెరోల్ పొందడంతో సోమవారం సునారియా జైలు నుంచి విడుదలయ్యారు. తన ఇద్దరు భక్తురాళ్లపై అత్యాచారం చేసినందుకు 20 సంవత్సరాల జైలు శిక్ష అనుభవిస్తున్న ఆయన, 2017లో దోషిగా తేలినప్పటి నుంచి పెరోల్‌పై బయటకు రావడం ఇది 15వ సారి కావడం గమనార్హం. పెరోల్ కాలంలో, ఆయన హర్యానాలోని సిర్సాలో గల డేరా ప్రధాన కార్యాలయంలో ఉంటారని ఆ శాఖ ప్రతినిధి మరియు న్యాయవాది జితేందర్ ఖురానా తెలిపారు. 16 సంవత్సరాల క్రితం జర్నలిస్టు హత్య కేసులోనూ గుర్మీత్ సింగ్‌ను కోర్టు 2019లో దోషిగా తేల్చింది. గతంలో 2025 ఏప్రిల్‌లో 21 రోజులు, 2025 ఆగస్టులో కూడా 40 రోజుల పెరోల్‌పై ఆయన బయటకు వచ్చారు. మరోవైపు గుర్మీత్ సింగ్‌కు పెరోల్ ఇవ్వడాన్ని సిక్కు సంస్థలు వ్యతిరేకిస్తున్నాయి.

## అమెరికా నిర్బంధంలో వెనెజువెలా అధ్యక్షుడు



వెనెజువెలా అధ్యక్షుడు నికోలస్ మదురో, ఆయన భార్య సిలియా ఫ్లోరెస్‌లను అమెరికా సైనిక బలగాలు పట్టుకుని న్యూయార్క్‌కు తరలించిన ఘటన ప్రపంచవ్యాప్తంగా భారీ చర్చను రేపుతోంది. ఈ సంఘటనపై చైనా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీ మాట్లాడుతూ, అమెరికా తనను తాను ప్రపంచ పోలీస్‌గా భావించుకుని ఇతర దేశాల సార్వభౌమత్వాన్ని ఉల్లంఘిస్తోందని మండిపడ్డారు. ఏ దేశానికి అంతర్జాతీయ న్యాయమూర్తిగా వ్యవహరించడానికి అర్హత లేదని, బలప్రయోగంతో తమ ఇష్టాలను రుద్దడం సరికాదని స్పష్టం చేశారు. అన్ని దేశాల సార్వభౌమత్వాన్ని గౌరవించడం ద్వారానే ప్రపంచ శాంతి సాధ్యమవుతుందని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం అంతర్జాతీయ పరిస్థితి అస్థిరంగా ఉందని ఆయన చెప్పారు. బలప్రయోగాన్ని చైనా ఎప్పుడూ వ్యతిరేకిస్తుందని తెలిపారు. అంతర్జాతీయ చట్టాలు అన్ని దేశాల సార్వభౌ మత్వాన్ని రక్షించాలని అన్నారు. అన్ని దేశాల సార్వభౌమత్వాన్ని గౌరవించినప్పుడే ప్రపంచ శాంతి సాధ్యమవుతుందని తెలిపారు. గత రెండు దశాబ్దాలుగా వెనెజువెలా చమురును అత్యధికంగా కొనుగోలు చేస్తున్న చైనా, ఈ ఘటనను ఏకపక్ష దురాక్రమణగా అభివర్ణిస్తూ అమెరికాపై తీవ్ర విమర్శలు గుప్పించింది. ఇలాంటి చర్యలు అంతర్జాతీయ సంబంధాలను మరింత దిగజారుస్తాయని ఆందోళన వ్యక్తం చేసింది.

## ఈ ప్రపంచం డొనాల్డ్ ట్రంప్ ముందు మోకరిల్లదు



ప్రస్తుతం వెనెజువెలాలో నెలకొన్న పరిస్థితి ఈ ప్రపంచానికి మంచిది కాదని కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే అన్నారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఈ ప్రపంచంలోని జనాభాను భయపెట్టే ప్రయత్నం చేస్తున్నాడని విమర్శించారు. ఎవరు రాజ్య విస్తరణకు ప్రయత్నించినా దాన్ని ఎక్కువ కాలం కొనసాగించలేరని ఖర్గే అన్నారు. హిట్లర్, ముస్సోలినీ లాంటి వాళ్లు కూడా అలాంటి ప్రయత్నాలు చేసి కనుమరుగైపోయారని చెప్పారు. కొంతమంది కుటిల ఆలోచనలతో ప్రపంచ శాంతిని చెడగొట్టేందుకు ప్రయత్నించడం మంచిది కాదని అన్నారు. భారత్-పాకిస్థాన్ దేశాల మధ్య శాంతిని నెలకొల్పడంలో తాను కీలక పాత్ర పోషించానని ట్రంప్ ఎప్పుడూ చెబుతుంటాడని, ఇప్పటివరకు దాదాపు 70 సార్లు ఈ విషయం చెప్పాడని తెలిపారు. ఈ ప్రపంచంలో తానే అత్యంత గొప్ప వ్యక్తినని, ఈ ప్రపంచం తనముందు మోకరిల్లుతుందనేది ట్రంప్ మాటలకు అర్థమని ఖర్గే చెప్పారు. కానీ ట్రంప్ ముందు మోకారిల్లాల్సిన అవసరం ఈ ప్రపంచానికి లేదని అన్నారు. మనం ప్రజాస్వామ్యంలో జీవిస్తున్నామని, ప్రజాస్వామ్య పద్ధతిలోనే ముందుకు పోతామని వ్యాఖ్యానించారు. 'బతుకు, బతుకనివ్వు' అనేది నెహ్రూ పాలసీ అని, అదే మా పాలసీ కూడా అని చెప్పారు. ట్రంప్ మాట్లాడిన ఒక ఆడియో విన్నానని, 'మోదీకి నేనంటే గౌరవమని, నా మాట వింటాడని నాకు తెలుసు' అన్నది ఆ ఆడియో సారాంశమని ఖర్గే అన్నారు. అంటే మోదీ తన కంట్రోల్‌లో ఉన్నాడనేది దీని అర్థమా..? అని ఆయన ప్రశ్నించారు. మోదీ ఎందుకు ట్రంప్ ముందు బెండ్ అవుతున్నాడో తనకు అర్థం కావడం లేదని అన్నారు. ఇది దేశానికి ప్రమాదకరమని చెప్పారు. నిన్ను ప్రజలు ప్రధానిగా ఎన్నుకున్నది ట్రంప్ చెప్పినట్లు తలూపడానికి కాదని అన్నారు.

# మున్సిపల్ ఎన్నికల్లో గులాబీ జెండా ఎగరవేస్తాం





**గుమ్మడిదల : (శుభోదయం న్యూస్)**

గుమ్మడిదల మున్సిపాలిటీలోని రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో తెలంగాణ సమృద్ధి, అభివృద్ధికి ప్రతీకగా గులాబీ జెండా ఎగరవేయడం ఖాయమని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి స్పష్టం చేశారు. నూతన మున్సిపాలిటీనీ అభివృద్ధి మార్గంలో తీర్చిదిద్దేందుకు పార్టీ ప్రజాక్షేత్రంలో బలంగా పోరాడుతుందని తెలిపారు. ప్రజా సమస్యలను గుర్తించి వాటిని ఎండగడుతూ పరిష్కారానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. పార్టీ కోసం కష్టపడ్డ ప్రతి కార్యకర్తకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని హామీ ఇచ్చారు.గుమ్మడిదల మున్సిపాలిటీ కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో మండల పార్టీ అధ్యక్షుడు కొత్తపల్లి ప్రభాకర్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో వివిధ పార్టీలకు చెందిన నాయకులు, యువకులు వివిధ పార్టీలో నుంచి 300 మంది యువకుల చేరిక పార్టీలో చేరారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన చిమ్ముల గోవర్ధన్ రెడ్డి నూతన సభ్యులకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ చేరికలతో పార్టీ క్యాడర్‌లో నూతన ఉత్సాహం నెలకొంది. ఈ సందర్భంగా గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం గత రెండు సంవత్సరాలుగా ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తోందని విమర్శించారు. అభివృద్ధి పనులు చేయడంలో పూర్తిగా విఫలమైందని పేర్కొన్నారు. గ్రామాల్లో సమస్యలు పేరుకుపోతున్నా వాటి పరిష్కారానికి సరైన చర్యలు లేకపోవడం ఆందోళన కలిగించే అంశమని తెలిపారు. ఎన్నికల సమయంలో మహిళలకు రూ.2500, పెన్షన్లు, తులం బంగారం, పంట బోనస్ వంటి హామీలు ఇచ్చి వాటిని అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు.ముఖ్యంగా రైతులకు చెందిన భూములను అన్యాయంగా స్వాధీనం చేసుకుంటున్నారని ఆరోపించారు. ఇప్పటికే గుమ్మడిదలకు చెందిన 109 సర్వే నంబర్ భూమిని స్వాధీనం చేసుకున్నారని, త్వరలో నల్లవల్లి, దోమడుగు, అన్నారం గ్రామాలకు సంబంధించిన భూములను కూడా లాక్కోవడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని పేర్కొన్నారు. గ్రామాలను మున్సిపాలిటీలుగా ఏర్పాటు చేసి ప్రజలపై అధిక పన్నుల భారం మోపుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.గత బీఆర్ఎస్ పాలనలో ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో ప్రజలకు సంక్షేమ పాలన అందిందని గుర్తు చేశారు. మాజీ మంత్రి హరీష్ రావు జిల్లా ప్రజల సమస్యలపై నిరంతరం స్పందిస్తూ పరిష్కారానికి కృషి చేశారని తెలిపారు. ప్రతి గ్రామంలో తాగునీరు, రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ వంటి మౌలిక వసతులతో పాటు సంక్షేమ పథకాలు అమలు చేశామని వివరించారు. రైతులకు సంక్షేమ పథకాలు అందించి 24 గంటలు ఉచిత కరెంట్‌తో ప్రతి పంటకు అండగా నిలిచామని స్పష్టం చేశారు.రానున్న మున్సిపల్ ఎన్నికల్లో అత్యధిక స్థానాలను గెలిచి భారీ మెజారిటీతో గుమ్మడిదల గడ్డపై గులాబీ జెండా ఎగరడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. పార్టీ బలోపేతానికి కృషి చేసిన ప్రతి కార్యకర్తకు భవిష్యత్తులోనూ పూర్తి మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి కుమార్ గౌడ్, విజయభాస్కర్ రెడ్డి, హుస్సేన్, సర్పంచ్ కొమ్ము శీను, మాజీ సర్పంచ్ లు రాజశేఖర్,వేణు, మురళి, నాయకులు రాజేష్, బాలకృష్ణ రెడ్డి, దేవేందర్ రెడ్డి, నరేందర్ రెడ్డి, వెంకట్రాంరెడ్డి, మొగులయ్య సంజీవరెడ్డి, రామ్ రెడ్డి, కుమార్,నరహరి, రాజు,పొన్నాల శ్రీనివాస్ రెడ్డి, సత్యనారాయణ, రుక్మారెడ్డి, ఆంజనేయులు, గోపాల్, అశోక్, మురళి, చక్రపాణి, భాస్కర్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.ం

# హైదరాబాద్‌లో 'ట్రౌట్' చేపల సాగు కేంద్రం



**రంగారెడ్డి :** హైదరాబాద్ శివారులో రెయిన్‌బో ట్రౌట్ చేపల పెంపకానికి సరికొత్త అధ్యాయం మొదలైంది. దక్షిణ భారతదేశంలోనే మొట్టమొదటి భారీ స్థాయి రీసర్క్యులేటింగ్ ఆక్వాకల్చర్ సిస్టమ్ ఆధారిత ఫారమ్‌ను రేపు కేంద్ర మంత్రి ప్రారంభిస్తున్నారు. అత్యాధునిక సాంకేతికతతో వేడి వాతావరణంలోనూ శీతల నీటి చేపల పెంపకాన్ని ఇది సాధ్యం చేస్తుంది. గ్రామీణ యువతకు శిక్షణతో పాటు ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయి.మత్స్య పరిశ్రమలో సరికొత్త అధ్యాయానికి హైదరాబాద్ వేదికవుతోంది. సాధారణంగా హిమాలయాలు, శీతల పర్వత ప్రాంతాలకే పరిమితమైన 'రెయిన్‌బో ట్రౌట్' చేపలను.. ఇప్పుడు దక్షిణ భారతదేశపు ఉష్ణమండల వాతావరణంలో పెంచబోతున్నారు. దేశంలోనే మొట్టమొదటి భారీ స్థాయి రీసర్క్యులేటింగ్ ఆక్వాకల్చర్ సిస్టమ్ ఆధారిత రెయిన్‌బో ట్రౌట్ ఫారమ్‌ను కేంద్ర మత్స్య, పశు సంవర్ధక శాఖ మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ రేపు (జనవరి 5) ప్రారంభించనున్నారు.రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలంలో స్మార్ట్ గ్రీన్ ఆక్వాకల్చర్ లిమిటెడ్ ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. ఇప్పటివరకు చేపల సాగు అనేది ఆయా ప్రాంతాల వాతావరణంపై ఆధారపడి ఉండేది. కానీ ఈ ప్రాజెక్ట్ ఆ అంచనాలను తలకిందులు చేసింది. అత్యాధునిక ప్రెసిషన్ ఇంజనీరింగ్ , నీటిని నిరంతరం శుద్ధి చేసే వాటర్ రీసర్క్యులేషన్ సాంకేతికతతో హైదరాబాద్ వంటి వేడి వాతావరణంలో కూడా ఏడాది పొడవునా శీతల నీటి చేపలను పెంచవచ్చని ఈ సంస్థ నిరూపించింది. వాతావరణం కంటే సాంకేతికతే సాగుకు ప్రాధాన్యతనిస్తుందని ఈ కేంద్రం చాటిచెప్పనుందికేవలం ఉత్పత్తి కేంద్రంగానే కాకుండా పరిశోధనా సంస్థగా కూడా పనిచేయనుంది. గ్రామీణ యువతకు, విద్యార్థులకు ఆటోమేషన్, బయోసెక్యూరిటీ, ఆధునిక ఆక్వాకల్చర్ పద్ధతులపై ఇక్కడ ప్రత్యక్ష శిక్షణ ఇస్తారు. తద్వారా స్థానికంగా ఉపాధి అవకాశాలు మెరుగుపడటమే కాకుండా, నూతన పారిశ్రామికవేత్తలు తయారయ్యే అవకాశం ఉంది. మత్స్య రంగాన్ని బలోపేతం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం 2015 నుండి ఇప్పటివరకు సుమారు రూ. 38,572 కోట్ల పెట్టుబడులకు ఆమోదం తెలిపింది. ముఖ్యంగా కోల్డ్ వాటర్ ఫిషరీస్‌కు అంతర్జాతీయ మార్కెట్‌లో విపరీతమైన డిమాండ్ ఉంది. ఉత్తరాఖండ్, హిమాచల్ ప్రదేశ్, జమ్మూ కాశ్మీర్ వంటి రాష్ట్రాలకే పరిమితమైన ఈ సాగును ఇప్పుడు దేశవ్యాప్తంగా విస్తరిస్తున్నారు. ప్రస్తుతం ఏటా 14 లక్షల ట్రౌట్ విత్తనాల ఉత్పత్తి లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోంది.మత్స్య రంగాన్ని కేవలం జీవనోపాధిగానే కాకుండా, ఒక సాంకేతిక ఆధారిత ఎగుమతి రంగంగా మార్చడమే ప్రభుత్వ లక్ష్యం. ఉత్తరాఖండ్ ప్రభుత్వం ఇప్పటికే ఐటీబీపీతో ఒప్పందం చేసుకుని సరిహద్దు గ్రామాల్లో ఈ చేపల సరఫరాను ప్రోత్సహిస్తోంది. అదేవిధంగా జమ్మూ కాశ్మీర్, లడఖ్ ప్రాంతాల్లో ఫిషరీస్ క్లస్టర్లను అభివృద్ధి చేస్తున్నారు. హైదరాబాద్‌లో ప్రారంభం కానున్న ఈ సరికొత్త సాగు కేంద్రం, భవిష్యత్తులో దేశీయంగా చేపల వినియోగాన్ని పెంచడమే కాకుండా విదేశీ మారక ద్రవ్యాన్ని ఆర్జించడంలో కీలక పాత్ర పోషించనుంది.

# ముందుకు సాగని ఆయిల్ పామ్...



**కరీంనగర్ :** రాష్ట్రంలో ఆయిల్ పామ్ సాగు అభివృద్ధి కోసం కేటాయించిన ఫ్యాక్టరీ జోన్లలో ఒప్పంద నిబంధనల ప్రకారం పురోగతి సాధించని కంపెనీలపై ప్రభుత్వం చర్యలకు ఉపక్రమించింది. పురోగతి లేని ఆయిల్ పామ్ కంపెనీల ఫ్యాక్టరీ జోన్లను తగ్గిస్తూ, ఆయా ప్రాంతాలను తెలంగాణ ఆయిల్ ఫెడ్‌కు కేటాయిస్తూ శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. తెలంగాణ ఆయిల్ పామ్ (ఉత్పత్తి, ప్రాసెసింగ్‌ని యంత్రణ) చట్టం, 1993, నిబంధనలు- 2008 ప్రకారం, ఆయిల్ పామ్ కంపెనీలు రైతు నాట్ల నుంచి 36 నెలల్లోపు ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేసి, ఫ్యాక్టరీ జోన్ పరిధిలో రైతులకు సేవలు అందించాల్సి ఉంటుంది.అయితే పలు కంపెనీలు ఈ నిబంధనలను ఉల్లంఘిస్తూ, ప్రాసె సింగ్ యూనిట్ల ఏర్పాటు, నాట్ల విస్తరణ, నర్స రీ అభివృద్ధి వంటి అంశాల్లో నిర్లక్ష్యం ప్రదర్శించింది. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పలుమార్లు సమీక్షలు నిర్వహించినప్పటికీ ఎటువంటి పురోగతి లేకపోవడం తో ప్రభుత్వం చర్యలు తీసుకుంది. లోహియా ఎడిబుల్ ఆయిల్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు కరీంనగర్ జిల్లాలో కేటాయించిన 44,527 ఎకరాల కు 6,721 ఎకరా ల్లో మాత్రమే ఆయిల్‌పామ్ సాగులోనికి తెచ్చింది. కరీంనగర్ జిల్లాకు సంబంధించిన ఫ్యాక్టరీ జోన్‌ను రద్దు చేసి తెలంగాణ ఆయిల్ ఫెడ్‌కు కేటాయించారు.మ్యాట్రిక్స్ పామ్ ఆయిల్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్‌కు కొమరంభీమ్ ఆసిఫాబాద్ జిల్లా లో కేటాయించిన 30,552 ఎకరాలకుగాను, కేవలం 1,606 ఎకరాలు, అదేవిధంగా కేవన్ బయోసైన్సెస్ (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్‌కు హనుమకొండలోని 9 మండలాలు, వరంగల్ జిల్లాలలోని 2 మండలాలు కలిపి 14,000 ఎకరాలు లక్ష్యం ఇవ్వగా, కేవలం 2,136 ఎకరాలనే సాగులోనికి తెచ్చారు. ఆ జిల్లాల్లో ఫ్యాక్టరీ జోన్లను పూర్తిగా రద్దు చేస్తూ, వాటిని ఆయిల్ ఫెడ్‌కు కేటాయించారు. ప్రభుత్వం పంటల మార్పిడి అవసరాన్ని తెలియజేసేలా, వంటనూనెల దిగుమతులపై ఆధారాన్ని తగ్గించాలన్న లక్ష్యంతో ఆయిల్ పామ్ సాగును ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. నేషనల్ మిషన్ ఆన్ ఎడిబుల్ ఆయిల్స్, ఆయిల్ పామ్ కింద రాష్ట్రంలో ఈ కార్యక్రమా న్ని సమర్థవంతంగా అమలు చేస్తున్నామని వ్యవసాయశాఖ సెక్రటరీ తెలిపారు.

## బీహెచ్ఈఎల్ టౌన్ షిప్ లోని అయ్యప్ప స్వామి ఆలయంలో ఇరుముడి పూజా కార్యక్రమంలో పాల్గొన్న ఆదర్శ్ రెడ్డి



**పటాన్చెరు (శుభోదయం న్యూస్):**

పటాన్‌చెరు నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జ్ ఆధర్శ్ రెడ్డి అయ్యప్ప స్వామి మాలధారణ చేసి, ఇరుముడి పూజ అనంతరం అయ్యప్ప స్వామి దర్శనం కోసం శబరిమలకు బయలుదేరే సందర్భంగా, ఉదయం బీహెచ్ఈఎల్ టౌన్‌షిప్‌లోని అయ్యప్ప స్వామి ఆలయంలో ఇరుముడి పూజ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ పవిత్ర కార్యక్రమంలో ఆధర్శ్ రెడ్డి కుటుంబ సభ్యులతో పాటు మాజీ ప్రొటెమ్ చైర్మన్ శ్రీ భూపాల్ రెడ్డి గారు, ఆర్‌సీపురం మాజీ సర్పంచ్ శ్రీ రాజేశ్వర్ రెడ్డి ,మాజీ కార్పొరేటర్ తోంట అంజయ్య బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు శ్రీ కుమార్ గౌడ్, జగన్నాథ్ రెడ్డి,సోషల్ మీడియా ఇన్చార్జి రవి కిరణ్ మాజీ కౌన్సిలర్ శ్రీనివాస్ రెడ్డి, బీఆర్ఎస్‌వీ కోఆర్డినేటర్ చిన్న, యువ నాయకులు సాయి చరణ్ గౌడ్,మాణిక్ యాదవ్, సాయి చందర్ రెడ్డి,శ్రీ వెంకట్ రెడ్డి, సుధాకర్, జకీర్, నరేష్,జానీ, దిలీప్ సింగ్, ప్రవీణ్, వేను ఎల్ఐజీ కాలనీ ప్రెసిడెంట్ యాదగిరి రెడ్డి, మాజీ ప్రెసిడెంట్ నారాయణ రెడ్డి మహేష్, కుమార్, ఘౌస్ మరియు ఇతర బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించగా, కార్యక్రమం భక్తి భావాలతో ఆధ్యాత్మిక వాతావరణంలో ప్రశాంతంగా ముగిసింది.

# కవిత ఆరోపణలు.. చర్యలు తీసుకోని సీఎం

-మొదటిపేజీ తరువాయి

సీఎం రేవంత్‌రెడ్డేనని బీజేపీ చీఫ్ రాంచందర్ రావు ఆరోపించారు. బీఆర్ఎస్, బీజేపీలు రెండు ఒక్కటే అనడం ఎమ్మెల్సీ కవిత అవగాహనా లోపమని తెలిపారు. సోమవారం నాడు శాసన మండలికి కల్వకుంట్ల కవిత హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె కీలక వ్యాఖ్యలు చేశారు. మండలిలో తనది ఇదే చివరి ప్రసంగమని కన్నీరు పెట్టుకున్నారు. ఒక వ్యక్తిగా బయటకు వెళ్తున్నానని.. బలమైన శక్తిగా తాను మళ్లీ చట్ట సభల్లోకి వస్తానంటూ కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. తన రాజకీయ భవిష్యత్‌తోపాటు తాను ఎదుర్కొన్న పరిస్థితులు, బీఆర్ఎస్ పార్టీపై కవిత హాట్ కామెంట్స్ చేశారు. తన రాజీనామాను ఆమోదించాలంటూ మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డికి ఈ సందర్భంగా కవిత విజ్ఞప్తి చేశారు.

## కవిత కొత్త పార్టీ జాగృతి..!

-మొదటిపేజీ తరువాయి

అవతరించనుందని కవిత ప్రకటించారు. రాజకీయంగా అందరూ మద్దతు ఇవ్వండని విజ్ఞప్తి చేశారు. త్వరలోనే పార్టీ విధివిధానాలను ప్రకటిస్తానన్నారు. ఇంటి పార్టీ నుంచి అవమాన భారంతో బయటకు వస్తున్నానని.. గొప్ప రాజకీయ శక్తిగా ఎదుగుతామన్నారు. సమస్యలపై పోరాడుతామన్నారు. రాజకీయాల్లో మార్పు తెచ్చే వేదికగా జాగృతి అవతరిస్తుందన్నారు కవిత. అంతకుముందు శాసనమండలిలో మాట్లాడిన కవిత కన్నీటిపర్యంతం అయ్యారు. ఇదే తన చివరి ప్రసంగం అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. తాను ఓ వ్యక్తిగా బయటకు వెళ్తున్నానని, బలమైన శక్తిగా తిరిగి చట్టసభలకు వస్తానంటూ కవిత చెప్పారు. తన రాజీనామాను ఆమోదించాలంటూ మండలి ఛైర్మన్ కు విజ్ఞప్తి చేశారు. అయితే, ఎమ్మెల్సీ కవిత తాజా వ్యాఖ్యలతో ఆమె కొత్త పార్టీపై కొన్ని నెలలుగా సాగుతున్న ప్రచారానికి తెరపడింది.

## మధ్యవర్తిత్వంతో పరిష్కరించుకోండి

-మొదటిపేజీ తరువాయి

నిర్ణయాధికారాన్ని ఇస్తాం.

3. మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించుకుని అవకాశం ఇచ్చారు.

**జస్టిస్ సూర్యకాంత్ కీలక వ్యాఖ్యలు..**

అంతకుముందు, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుతం ఈ ప్రాజెక్టు ప్లానింగ్ దశలోనే ఉంది కదా?. ప్లానింగ్ డాక్యుమెంటేషన్ ప్రిపరేషన్‌కి ఏపీ నిధులే వృథా అవుతాయి కదా?. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం ఒక కమిటీ ఏర్పాటు చేసింది. ఈ పిటిషన్ విచారణ అర్హతను పరిశీలిస్తున్నాం. సివిల్ సూట్ ఫైల్ చేస్తేనే సమగ్రంగా విచారణ జరపవచ్చు. ప్రాజెక్టు ఆపాలన్న మీ అభ్యర్థనను కేంద్ర ప్రభుత్వ కమిటీ పరిశీలించేలా చూడమని ఆదేశాలు ఇస్తాం. అలాగే మధ్యవర్తిత్వం ద్వారా ఈ సమస్యను పరిష్కరించుకునే ప్రయత్నం చేయండి అని అన్నారు.

**ఏకపక్షంగా నిర్మాణం..**

అనంతరం, తెలంగాణ ప్రభుత్వం తరపున సీనియర్ న్యాయవాది అభిషేక్ సింఘ్వి వాదనలు వినిపిస్తూ.. 'వరద జలాల పేరుతో మాకు కేటాయించిన నీటి వాటాను తరలించుకునే ప్రయత్నం చేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఏకపక్షంగా ఈ ప్రాజెక్టు నిర్మిస్తున్నారు. ప్రాజెక్టుపై వెంటనే సుప్రీంకోర్టు స్టే ఇవ్వాలి. గోదావరిలో తెలంగాణకు 968 టీఎంసీల నీటి వాటా ఉంది. పోలవరం-నల్లమల్లసాగర్ ప్రాజెక్టుతో మా వాటా తగ్గుతుంది. ఈ ప్రాజెక్టును ఆపాలని కేంద్ర జల సంఘం ఇచ్చిన ఆదేశాలను ఏపీ పట్టించుకోవడం లేదు. సీడబ్ల్యూసీ చైర్మన్ నేతృత్వంలో ఇటీవల కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీకి ప్రాజెక్టును ఆపే అధికారం లేదు. సుప్రీంకోర్టు వెంటనే జోక్యం చేసుకొని ఈ ప్రాజెక్టును ఆపాలన్నారు.

**రాష్ట్ర ప్రాజెక్ట్ మాత్రమే..**

మరోవైపు.. ఏపీ ప్రభుత్వం తరపున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ వాదనలు వినిపిస్తూ..'పోలవరం-నల్లమలసాగర్ ప్రాజెక్టులో మేము నిబంధనలు ఉల్లంఘించలేదు. కేవలం మేము ప్లాన్ రెడీ చేసుకుంటున్నాం. సముద్ర జలాలు వృథా అవుతున్నాయి. వాటిని రాయలసీమకి అందించాలనుకుంటున్నాం. ఇది రాష్ట్ర ప్రాజెక్టు మాత్రమే జాతీయ ప్రాజెక్టు కాదు. మా రాష్ట్ర అవసరాలపైన ప్లానింగ్ చేసుకునే అధికారం ఉంది. మేము పీఎఫ్ఆర్, డీపీఆర్‌లను తయారు చేస్తున్నాము అని తెలిపారు. ఈ క్రమంలో సుప్రీంకోర్టు సూచించిన పరిష్కారాలపై తెలంగాణ ప్రభుత్వం నిర్ణయాన్ని తెలుసుకునేందుకు సమయం ఇవ్వాలని అభిషేక్ సింఘ్వీ కోరారు. అనంతరం, కేసు తదుపరి విచారణను వచ్చే సోమవారానికి వాయిదా చేశారు.

## ప్రత్యేక యాప్‌ల ద్వారా మోసాలు

-మొదటిపేజీ తరువాయి

నష్టపోతున్నారు. ఆ అప్పులు తీరే దారి లేక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ఇలాంటి ఘటనలు ఉమ్మడి వరంగల్ జిల్లాలో వెలుగులోకి వచ్చాయి.

కమలాపూర్ మండలం అంబాలకు చెందిన శ్రీకాంత్ పీజీ చదివాడు. ఫోన్‌లో ఆన్‌లైన్ బెట్టింగ్‌ల కోసం రూ.13 లక్షల అప్పులు చేశాడు. ఆ అప్పులు తీర్చలేక మనస్తాపంతో డిసెంబర్ 25న గడ్డిమందు తాగాడు. కుటుంబ సభ్యులు ఆయనను 108 వాహనంలో ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. గత సంవత్సరం జనవరిలో వర్ధన్నపేట మండలం ఇల్లందకు చెందిన రాజ్‌కుమార్ అనే యువకుడు బెట్టింగ్ యాప్‌ల్లో రూ.30 లక్షలు పోగొట్టుకున్నాడు. పోయిన డబ్బు తిరిగి సంపాదించలేక మనస్తాపంతో ఆత్మహత్య చేసుకున్నాడు.ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఓ గృహిణి బెట్టింగ్ యాప్‌లో జూదం ఆడి, రూ.2 లక్షలు పోగొట్టుకుంది. కుటుంబ సభ్యులు మందలించడంతో ఆత్మహత్యకు యత్నించింది. ఆసుపత్రిలో చికిత్స అందించడంతో ఆమె బతికింది.

# బైక్ దొంగల ముఠా అరెస్ట్ 80 లక్షల విలువైన 21 ద్విచక్ర వాహనాల స్వాధీనం





**శేరిలింగంపల్లి నియోజకవర్గం, మియాపూర్ ప్రతినిధి హేమాప్రియ(శుభోదయం న్యూస్):**

జల్సాలకు అలవాటు పడి ద్విచక్ర వాహనాల దొంగతనాలకు పాల్పడుతున్న ఏపీకి చెందిన ముఠాను మియాపూర్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ విషయాన్ని మియాపూర్ ఏసీపీ వై. శ్రీనివాస్ కుమార్ విలేకరుల సమావేశంలో వెల్లడించారు.ఈ కేసులో సాయి కిరణ్ (23), లీల సాయి (21)అనే ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసినట్లు తెలిపారు.దొంగతనం కేసులో మరో నిందితుడు విజయశివ సాయి ప్రసాద్ (25) ప్రస్తుతం ఏపీ అనకాపల్లి పోలీసుల పరిధిలో ఉండగా, గెడ్డం ప్రవీణ్ (25) పరారీలో ఉన్నట్లు తెలిపారు.నిందితులు నలుగురు ఏపీకి చెందిన ముఠాగా గుర్తించారు. గతంలో అత్తాపూర్ పరిధిలో కూడా వీరిపై కేసు నమోదై ఉండగా, నిందితుడు జైలుకు వెళ్లినా తీరు మారలేదని ఏసీపీ తెలిపారు.నిందితుడు మెకానిక్ వృత్తిలో ఉండటంతో బైక్‌ల లాక్స్‌ను సులభంగా తీసి చోరీలు చేస్తున్నాడని, ఖరీదైన యమహా, కేటీఎమ్, డ్యూక్ వంటి ద్విచక్ర వాహనాలనే లక్ష్యంగా చేసుకుని దొంగతనాలు చేస్తున్నట్లు చెప్పారు. చోరీ చేసిన బైక్‌లకు చాసిస్ నంబర్ మార్పు చేసి విక్రయాలు చేస్తున్నట్లు దర్యాప్తులో వెల్లడైంది. ఈ కేసులో రూ. 80 లక్షల విలువైన 21 ద్విచక్ర వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై చీటింగ్, ఫోర్జరీ కేసులు కూడా నమోదు చేసినట్లు తెలిపారు.ఈ కేసును ఛేదించడంలో ప్రతిభ చూపిన మియాపూర్ క్రైమ్ టీమ్ ప్రేమ్ కుమార్, పూర్ణ చందర్, చంద్ర బోస్, యాదయ్య, రుశేశ్వర్, మల్లికార్జున, కీర్తి కుమార్, శేఖర్, స్వప్నలను మాదాపూర్ డీసీపీ ప్రత్యేకంగా అభినందించారు అరెస్ట్ చేసిన నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

# పెద్దపల్లి జిల్లా ఓదెల మండలం కేంద్రంలోని రైల్వే గేట్ పనులను పరిశీలించిన ఎంపీ గడ్డం వంశీకృష్ణ

**పెద్దపల్లి జిల్లా, స్టాఫ్ రిపోర్టర్ (శుభోదయం న్యూస్):**

పెద్దపల్లి జిల్లా ఓదెల మండల కేంద్రం లోని రైల్వే గేటు మీద ఆర్‌ఓబీ నిర్మాణానికి కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో పనులు ఎంత వరకు వచ్చాయనే దానిపై ఎంపీ వంశీకృష్ణ రైల్వే అధికారు లతో సమావేశమై స్థల పరిశీలన,ఆర్‌ఓబీ అలైన్మెంటు పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ను ఓదెల ఆర్‌ఓబీ గురించి అడిగాను. దానికి అశ్విణి వైష్ణవ్ అనుకూలంగా స్పందించారు, రైల్వే తరుపున రీసెర్చ్ కోసం పంపడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. అలాగే ఎంపీగా తనను కూడా ఆన్గ్రౌండ్ ఇన్స్పెక్షన్లో కూడా పాల్గొన వచ్చన్నారు. దాంట్లో బాగంగా ఈ రోజు రైల్వే అధికారులతో కలిసి స్థలాన్ని పరిశీలించడం జరిగింది. అదే విధంగా అధికారులు తయారు చేసిన ఆర్‌ఓబీ అలైన్మెంటును ఎంపీ పరిశీలించారు.ఆర్‌ఓబీ నిర్మాణం వల్ల సామన్య ప్రజలకు నష్టం లేకుండా, రీహాబిటేషన్ తక్కువ ఉండేలా అలైన్మెంటు తయారయ్యేలా చూడాలన్నారు.ప్రజల ఇబ్బందులు తీర్చేలా ఆర్‌ఓబీ ని తొందరగా పూర్తి చేయల న్నారు.ఇప్పటికే ఎల్సీ 39



కునారం ఆర్‌ఓబీ, ఎల్సీ 49 కుందనపల్లి, ఎల్సీ 48 చీకు రాయి ఎస్టిమేషన్ తయార వుతుంది. అలాగే గౌరెడ్డిపేట వద్ద వంద శాతం ఫండింగ్ శాంక్షన్ అయింది. అలాగే ఎల్సీ 46 పెద్దంపేట, ఎల్సీ 52 లు ఎస్టిమేషన్ జరుగుతంది. ఎల్సీ 44 అందుగులపల్లి ఎస్టిమేషన్ అవుతుందని ఎంపీ పేర్కొన్నారు. పరిశీలించిన ఎంపీ రైల్వే అధికారులు ప్రసాద్, సుశాంత్ లకు ఆర్‌ఓబీ నిర్మాణం తొందరగా జరిగేలా చూడాలని సూచించారు. అలాగే ఓదెల రైల్వే స్టేషన్లో ఎంపీ ప్రయాణికులతో మాట్లాడారు. వారంతా రైల్వేస్టేషన్ లో ఉన్న సమస్యల ను ఎంపీ దృష్టికి తెచ్చారు. తాగు



నీరు,టాయిలెట్స్ లేక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నట్లు ఎంపీ దృష్టికి తెచ్చారు. ఈ క్రమంలో స్టేషన్లో నెలకొన్న సమస్యలను సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కారం అయ్యేలా చేస్తానన్నారు.

# నగర పాలక సంస్థ కార్యాలయంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమైన అదనపు కలెక్టర్ జె.అరుణ శ్రీ





**రామగుండం మండలం, రిపోర్టర్ (శుభోదయం న్యూస్):**

ముసాయిదా ఓటరు జాబితా కు సంబంధించి ఏవైనా అభ్యంతరాలు ఉంటే లిఖిత పూర్వకంగా సమర్పించాలని అదనపు కలెక్టర్ ( స్థానిక సంస్థలు ) రామగుండం నగర పాలక సంస్థ కమిషనర్ ( ఎఫ్ ఎ సి ) జె. అరుణ శ్రీ కోరారు.రాజ కీయ పార్టీల ప్రతినిధులతో సోమవారం రామగుండం నగర పాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడు తూ తేదీ 01.10.2025 నాటికి ఓటరుగా నమోదు అయిన వారిని ఎపిక్ ఐడి లో పేర్కొన్న చిరునామా ఆధారంగా ఆయా డివిజన్ ఓటరు జాబితాలో చేర్చడం జరిగిందని అన్నారు.తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం వెబ్ సైట్ లో ముసాయిదా ఓటరు జాబితా ప్రదర్శించడం జరుగుతున్నదని అన్నారు. ముసాయిదా ఓటరు జాబితాకు సంబందించి ఈ నెల 9 వరకు స్వీకరించిన అభ్యంతరాలను పరిష్కరించి 10 వ తేదీన తుది జాబితా ప్రచురించనున్నట్లు తెలిపారు. ఒక్కో పోలింగ్ బూత్ కు 800 ఓట్లు ప్రాతిపదికగా ఇంటి నుండి 2 కిలో మీటర్ల దూరం లోపు ఉండేలా ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. మరణించిన ఓటర్లు , రెండు చోట్ల నమోదు కాబడిన ఓటర్లు , శాశ్వతంగా వలస పోయిన ఓటర్ల వివరాలు లిఖిత పూర్వకంగా అందజేస్తే సవరణ నిమిత్తం ఎం ఆర్ ఓ కార్యాలయం దృష్టికి తీసు కెళ్తామని అన్నారు.ఈ సమావేశంలో నగర పాలక సంస్థ అడిషనల్ కమిషనర్ మారుతి ప్రసాద్ అసిస్టెంట్ కమిషనర్ వెంకటేశ్వర్లు , ఎ సి పి శ్రీహరి టి పి ఎస్ నవీన్ ఆర్ ఓ ఆంజనేయులు సూపరింటెండెంట్ పబ్బాల శ్రీనివాస్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

# ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా పిర్యాదులను స్వీకరించిన జిల్లా ఎస్పీ డి. వి. శ్రీనివాస రావు ఐపీఎస్ గారు

**మెదక్ జిల్లా, ప్రతినిధి బాలా గౌడ్ (శుభోదయం న్యూస్):**

జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఈ రోజు నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి జిల్లాలోని పలు గ్రామాల నుండి వచ్చిన ప్రజలు తమ సమస్యలను, వివాదాలను, పోలీసు సంబంధిత ఇబ్బందులను జిల్లా ఎస్పీ శ్రీ డి.వి. శ్రీనివాసరావు, ఐపీఎస్ గారికి నేరుగా వివరించారు కార్యక్రమంలో ఎస్పీ గారు ఒక్కొక్క ఫిర్యాదుదారునితో వ్యక్తిగతంగా మాట్లాడి వారి సమస్యలపై పూర్తి వివరాలు తెలుసుకుని, సమస్య లను క్షుణ్ణంగా పరిశీలించి, వెంటనే సంబంధిత సర్కిల్ ఇన్స్‌పెక్టర్లు, సబ్‌ఇన్స్‌పెక్టర్లకు ఆదేశాలు జారీ చేశారు. కొన్నింటిపై సంబంధిత ఎస్.ఎచ్.ఓ లతో ఫోన్‌లో మాట్లాడి త్వరితగతిన చర్యలు చేపట్టాలని సూచించారు. పోలీస్ శాఖ ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటు లో ఉంటుందని, ఎలాంటి పైరవీలు లేకుండా నేరుగా పోలీస్ అధికారులను సంప్రదించాలని, చట్టపరమైన మార్గంలో ప్రతి ఒక్కరికీ న్యాయం అందించడం మా ప్రధాన బాధ్యతని, పోలీస్ వ్యవస్థ ప్రజల కోసం ఉందని, ఎవరి జోక్యం లేకుండా నిర్భయంగా తమ సమస్యలను వెల్లడించాలని,ఇప్పటికే ప్రజావాణి ద్వారా పరిష్కారమైన అనేక కేసులు ప్రజల్లో నమ్మకాన్ని పెంచాయని ఎస్పీ గారు తెలిపారు.



## ట్రాఫిక్ రూల్స్, భద్రతపై విద్యార్థులకు అవగాహన

**ట్రాఫిక్ రూల్స్ పాటిస్తే ప్రమాదాలు దూరం.**
**ప్రతి ప్రయాణం సురక్షితం :ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ అనిల్ కుమార్**

**పెద్దపల్లి జిల్లా, స్టాఫ్ రిపోర్టర్(శుభోదయం న్యూస్):**



రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా పెద్దపల్లి ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ అనిల్ ఆధ్వర్యంలో రంగంపల్లి లోని మైనారిటీ రెసిడెన్షియల్ జూనియర్ కాలేజ్ లో "అరైవ్ అలైవ్" అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమం లో విద్యార్థులకు ట్రాఫిక్ రూల్స్,రోడ్డు భద్రత, సేఫ్టీ చర్యలు, ర్యాష్ డ్రైవింగ్, మైనర్ డ్రైవింగ్,రాంగ్ రూట్, ట్రిపుల్ డ్రైవింగ్ చట్ట రీత్యా నేరం అని, హెల్మెట్ మరియు సీట్‌బెల్ట్ తప్పనిసరి వినియోగం,మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల కలిగే ప్రమాదాలపై స్పష్టంగా అవగాహన కల్పించారు.చిన్న వయసు నుంచే రోడ్డు భద్రతపై అవగాహన కల్పిస్తే భవిష్యత్తు లో ప్రమాదాలను తగ్గించ వచ్చని ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ అనిల్ కుమార్ తెలిపారు. ప్రతి విద్యార్థి ట్రాఫిక్ నిబంధనలను తెలుసుకుని, వాటిని తమ కుటుంబ సభ్యులకు కూడా తెలియజేసి రోడ్డు భద్రతకు తోడ్పడాలని ఆయన కోరారు. రోడ్డు ప్రమాదాల వల్ల జరుగు తున్న ప్రాణనష్టం తగ్గించా లంటే ప్రతి వాహన దారుడు ట్రాఫిక్ నిబంధనలు కచ్చితంగా పాటించాలని ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ అనిల్ కుమార్ సూచించారు. సురక్షిత డ్రైవింగ్ అలవాట్ల తోనే ప్రతి ఒక్కరూ తమ గమ్యానికి సురక్షితంగా చేరు కోవచ్చని ఇన్స్పెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ అనిల్,ఎస్ ఐ రవీందర్, ప్రిన్సిపాల్ భాగ్యలక్ష్మిలు పాల్గొన్నారు.

## బొలెరా పల్టీలు కొట్టి ప్రయాణం చేస్తున్న భవన నిర్మాణ కార్మికులకు తీవ్ర గాయాలు ఒకరు మృతి

**ములుగు జిల్లా ప్రతినిధి( శుభోదయం న్యూస్):**




ములుగు జిల్లా,వాజేడు మండలం మండపాక గ్రామ రహదారిపై ఆదివారం ఏడు గంటల ప్రాంతంలో మందు తాగిద్విచక్రవాహనము నడుపుతూ అతివేగంగా బొలెరాకు ఎదురు రావడంతో బొలెరాను తప్పించటంతో బొలెరా పల్టీలు కొట్టి ఒకరు మృతి చెందారు. వాజేడు మండలంలోని చంద్రుపట్ల గ్రామానికి భవన నిర్మాణ కార్మికులు ఇంటి స్లాబ్ వేసి తిరిగి సాయంత్రం బొలెరా లో 14 మంది కార్మికులు ఎక్కి ఇంటికి వెళుతుడగా ద్విచక్ర వాహన దారుడు మందు తాగి అతివేగంగా బొలెరా ముందుకు దూసుకొచ్చాడు. ద్విచక్రవాహరాన్ని తప్పించబోయిన బొలెరా పల్టీ కొట్టడంతో అందరికీ తీవ్రమైన గాయాలు తగిలాయి ఒకరు మృతి చెందారు క్షతగాత్రులను వైద్య నిమిత్తం ఏటూర్ నాగారం ఆసుపత్రికి తీసుకెళ్లారు. భవన నిర్మాణ కార్మికుల స్వస్థలం మంగపేట మండలంలోని కమలాపురం గ్రామానికి చెందినవారు. ఏటూర్ నాగారం వైద్యశాల సిబ్బంది ఎంబటే స్పందించి వైద్యం అందిస్తున్నారు ప్రతిసారి తాగుబోతుల వల్లనే ప్రజలకు ప్రాణాల మీదికి వస్తున్నది. ఒక్క తాగుబోతు వల్ల 13 మందికి తీవ్ర గాయాలు ఒకరు మృతి చెందారు. ద్విచక్ర వాహనదారుడు ఏమాత్రం ఆగకుండా అదే స్పీడ్ లో వెళ్లిపోయాడు. చూసిన గ్రామస్తులు నివ్వెర పోయారు.

## కాంగ్రెస్ నాయకుడు దుంపల రాజు జన్మదిన వేడుకలు

**బీర్కూర్(శుభోదయం న్యూస్):**



బీర్కూర్ మండల కాంగ్రెస్ పార్టీ నాయకుడు దుంపల రాజు జన్మదినం సందర్భంగా మియ్యాపురం శశికాంత్ ఆధ్వర్యం లో జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేకు కట్ చేసి ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమం లో వార్డు సభ్యులు కొరిమి రఘు,ప్రశాంత్ యాదవ్,పృథ్వీ గౌడ్,అశోక్, గోండ,శ్రీనివాస్,మహేష్, సాయిరాం లు పాల్గొన్నారు.

## డ్రంక్ అండ్ డ్రైవ్ లో ఇద్దరికీ 02 రోజుల జైలు శిక్ష

**సిద్దిపేట జిల్లా, జనవరి 5, (శుభోదయం న్యూస్):**



సిద్ధిపేట ట్రాఫిక్ సీఐ ప్రవీణ్ కుమార్, సిబ్బందితో గత కొన్ని రోజుల క్రితం సిద్దిపేట పట్టణంలో నర్సాపూర్ చౌరస్తా, ఎంపీడీవో ఆఫీస్ చౌరస్తా, చౌరస్తాలలో మరియు రాజీవ్ రహదారిపై వాహనాలు తనిఖీ చేయగా, 34 మంది మద్యం సేవించి వాహనాలు నడుపుతుండగా పట్టుకొని బ్రీత్ ఎనలైజర్ తో తనిఖీ చేయగా మద్యం సేవించి ఉన్నారని రిపోర్టు రాగా సోమవారం సిద్దిపేట స్పెషల్ సెకండ్ క్లాస్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ కాంతారావు, న్యాయమూర్తి, 34 మందిని హాజరుపరచగా విచారణ చేసి మందికి 3,48,500/- రూపాయల జరిమాన, ఇద్దరికీ 02 రోజుల జైలు శిక్ష విధించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ సిఐ ప్రవీణ్ కుమార్, మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడవదని, డ్రంక్ అండ్ డ్రైవ్ లో పట్టుపడ్డ వాళ్ల కి పదివేల రూపాయల జరిమానా విధించడం జరుగుతుందన్నారు. మరియు రోడ్డు నిబంధనలు, ట్రాఫిక్ నిబంధనలు పాటించే వాహనాలు నడపాలని, రోడ్డు ప్రమాదాల నివారణ గురించి మాత్రమే ప్రతిరోజు డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్ నిర్వహించడం జరుగుతుందన్నారు.

# కార్పొరేషన్ పై గులాబీ జెండా ఎగురవేయడమే లక్ష్యంగా గులాబీ శ్రేణులకు దిశానిర్దేశం





**రామగుండం మాజీ ఎమ్మెల్యే పెద్దపల్లి జిల్లా బీ.ఆర్.ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు కోరుకంటి చందర్**

రామగుండం మండలం, రిపోర్టర్ (శుభోదయం న్యూస్):

రామగుండం నియోజకవర్గ బీ.ఆర్.ఎస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశం సోమవారం అడ్డగుంటపల్లి సిరి ఫంక్షన్ హాల్లో ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్లు రామగుండం మాజీ ఎమ్మెల్యే పెద్దపల్లి జిల్లా బీ.ఆర్.ఎస్ పార్టీ అధ్యక్షులు కోరుకంటి చందర్ తెలిపారు. రామగుండం కార్పోరేషన్ ఎన్నికల నేపథ్యం లో కార్పోరేషన్ పరిధిలో బీ.ఆర్.ఎస్ పార్టీ గెలుపు లక్ష్యంగా ముందుకు సాగడం జరుగుతుందని డివిజన్ వారిగా సమన్వయ కమిటీ ల ను ఎర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. బీ.ఆర్.ఎస్ పార్టీ గెలుపే లక్ష్యంగా గులాబీ శ్రేణులకు దిశానిర్దేశం చేయడం జరుగు తుందన్నారు. రెండు సంవత్సరాల కాలంగా రామ గుండం నియోజకవర్గం లో కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి పేరిట చేస్తున్న విధ్వంసం, కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామిలు నేరవెర్చ కుండా ప్రజలను మెసాలను చేసిన విధానాల ను ప్రతి ఇంటికి తీసుకువేళ్లేలా పార్టీ శ్రేణులను సమయత్తం చేయడం జరుగుతుందని పెర్కోన్నారు.ఇటివల జరిగిన గ్రామ పంచాయతి ఎన్నికల్లో గెలుపోందిన సర్పంచ్ లను వార్డు మెంబర్లకు సన్మానం కార్యక్రమం నిర్వహించండం జరిగుతుందని రామగుండం నియోజకవర్గం లోని మాజీ ప్రజా ప్రతినిధులు, పట్టణ మండల పార్టీ అధ్యక్షులు బీ.ఆర్.ఎస్ పార్టీ శ్రేణులు పాల్గోని విజయవంతం చేయాలని కోరారు.

# మహిళల అభివృద్ధి కోసం ప్రభుత్వం కృషి

## - ఎమ్మెల్యే మైనపల్లి రోహిత్ రావు
## - ముగ్గుల పోటీల్లో పాల్గొన్న మహిళలకు బహుమతులు పంపిణీ

మెదక్ జిల్లా, ప్రతినిధి బాలా గౌడ్ (శుభోదయం న్యూస్):



కాంగ్రెస్ ప్రభుత్వం హయంలో మహిళలకు మహాలక్ష్మి పథకం ప్రవేశపెట్టి వారి అభివృద్ధి కోసం ఎంతగానో కృషి చేస్తుందని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు అన్నారు. సోమవారం జిల్లా కేంద్రమైనమెదక్ సిద్ధార్థ పాఠశాలలో ఏబి.ఎన్ ఆంధ్రజ్యోతి ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీల్లో పాల్గొన్న మహిళలను ఆయన అభినందించారు. మహిళలకు ఎంతో ఇష్టమైన సంక్రాంతి పండుగ వేళా ముగ్గుల పోటీ నిర్వహించడం సంతోషించే దగ్గ విషయం అన్నారు. మహిళలు కేవలం ఇంటి పనులకే పరిమితం కాకుండా సమాజంలోని పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో దారించాలన్నది కాంగ్రెస్ ప్రభుత్వం దయమన్నారు. మహిళలకు ప్రభుత్వం మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలు ఉచిత ప్రయాణం చేసేందుకు అవకాశం కల్పించిందన్నారు. ఎమ్మెల్యే మైనపల్లి రోహిత్ రావు ముగ్గుల పోటీలు గెలుపొందిన మహిళలకు బహుమతి అందజేశారు. ఈ కార్యక్రమంలో మెదక్ మున్సిపల్ మాజీ చైర్మన్ చంద్రపాల్, సిద్ధార్థ విద్యా సంస్థల చైర్మన్ శ్రీనివాస్ చౌదరి,ఎఎస్పీ మహేందర్, కాంగ్రెస్ పట్టణ నాయకులు, మాజీ కౌన్సిలర్లు పాల్గొన్నారు

## మార్కెట్ ను ముంచెత్తుతున్న నకిలీలలు

**మహబూబ్ నగర్ :** మార్కెట్లో కల్తీ వంట నూనె విక్రయాలు జోరుగా కొనసాగుతున్నాయి. ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని అత్యుత్తమ బ్రాండ్ల పేరుతో మార్కెట్లోకి వస్తున్న వంట నూనెలను ప్రజలు వినియోగిస్తూ అస్వస్థతను కొనితెచ్చుకుం టున్నారు. సాధారణ పప్పులు, ఇతర పదార్థాలతో పాటు వంట నూనెలను కూడా కల్తీ చేస్తున్నారు. గజ్వేల్ ప్రాంతంలో ఏళ్ల తరబడిగా ప్రముఖ బ్రాండ్లకు చెందిన వంట నూనెలను కల్తీ చేస్తూ వ్యాపారులు ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్నారు. అధిక లాభాలను ఆర్జించడానికి నూనెలలో ఇతర నూనెలు పదార్థాలు కలుపుతూ కల్తీ చేయడమే కాకుండా ప్రముఖ కంపెనీల కవర్లను ముద్రించి వాటి ద్వారా కల్తీ వంట నూనెలను విక్రయిస్తున్నారు. ముఖ్యంగా ఓ ప్రముఖ కంపెనీ పేరుతో ప్రచారంలో ఉన్న పొద్దు తిరుగుడు విత్తనాలతో తయారు చేసిన వంట నూనెలను పత్తి గింజల నూనెతో కలిపి విక్రయిస్తున్నారు. ఈ కల్తీ నూనెను సాధారణంగా వంటలకు విక్రయించిన సమయంలో ఎలాంటి తేడా కనిపించడం లేదు. మాంసాహారం కానీ, తిను బండారాలు కానీ ఎక్కువగా వేయించిన పుడు ఆ పదార్థాలు, నూనె కూడా పత్తి గింజల నూనె మాదిరిగా వాసన వస్తున్నాయి.

# లింగాయపల్లి గ్రామంలో పేకాట ఆడుతున్న ఐదుగురు అరెస్ట్

**రూ.26,183 నగదు స్వాధీనం జిల్లా ఎస్పీ. డి. వి. శ్రీనివాస రావు**

పాపన్నపేట మండలం, రిపోర్టర్ ఎం రవీందర్ (శుభోదయం న్యూస్):

మెదక్ జిల్లా పాపన్నపేట మండలం లింగాయపల్లి గ్రామంలో పేకాట ఆడుతున్నారనే నమ్మదగిన సమాచారం మేరకు, జిల్లా ఎస్పీ శ్రీ డి.వి. శ్రీనివాస రావు, ఐపీఎస్ గారి ఆదేశాల మేరకు టాస్క్ ఫోర్స్ పోలీసులు, పాపన్నపేట పోలీస్ సిబ్బంది కలిసి జూదంపై ఆకస్మిక దాడి నిర్వహించారు.ఈ దాడిలో ఐదుగురు వ్యక్తులను అరెస్ట్ చేయడం జరిగింది: దాదిగారి కృష్ణగౌడ్, పుట్టి బాగయ్య, వగ్గు యాదయ్య, మెగావత్ కిషన్, నీరుడి లక్ష్మణ్.అదేవిధంగా పేకాటలో పాల్గొని పరారైన వ్యక్తులు:గుండమ్మ సాయిలు,పుట్టి బండాల సత్యనారాయణ,బెస్త వెంకటేశం,బుద్ధి సాయమ్మ,కర్రె సాయమ్మ సాయిలు,కోలా ధన్సింగ్.జూదం ఆడుతున్న ప్రదేశం నుండి మొత్తం రూ.26,183/– నగదును స్వాధీనం చేసుకున్నారు.పట్టుబడిన నిందితులను సంబంధిత పోలీస్ స్టేషన్‌కు తరలించి, వారి పై చట్టపరమైన చర్యలు చేపట్టడం జరుగుతున్నదని తెలిపారు. పరారైన నిందితులను త్వరలోనే పట్టుకుంటామని పేర్కొన్నారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ శ్రీ డి.వి. శ్రీనివాసరావు, ఐపీఎస్ గారు మాట్లాడుతూ జిల్లాలో చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదని, కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పేకాట, బెట్టింగ్ వంటి కార్యకలాపాల వలన ఎన్నో కుటుంబాలు నష్టపోతున్నాయని, ముఖ్యంగా యువత తక్కువ సమయంలో ఎక్కువ డబ్బు సంపాదించాలనే ఆలోచనలతో చెడు మార్గాలను ఎంచుకుంటున్నారని పేర్కొన్నారు. కష్టపడానీదే ఏదీ ఊరికే రాదని, ప్రజలు కూడా ఇలాంటి సమాచారాన్ని వెంటనే పోలీసులకు అందించి సహకరించాలని జిల్లా ఎస్పీ గారు సూచించారు.



# ఆత్మరక్షణకు ప్రతి ఒక్కరూ కరాటే నేర్చుకోవాలి

**జాతీయస్థాయి కరాటే పోటీల్లో బోయిన్ పల్లి విద్యార్థుల ప్రతిభ మాస్టర్స్ డి. సురేందర్, సుబ్బు, డీ. వంశీ లను అభినందించిన సినీ హీరో ఇంద్రసేన**

తెలంగాణ స్టేట్ బ్యూరో, దొమ్మాటి శివకుమార్(శుభోదయం న్యూస్):

కరాటే నేర్చుకోవడం వలన ఆత్మ రక్షణ, మానసికంగా ఆరోగ్యంగా దృఢంగా ఉండడానికి ఎంతో ఉపయోగపడుతుందని, సినీ హీరో ఇంద్రసేన అన్నారు. ఇటీవలే ఎల్బీ స్టేడియంలో జరిగినటువంటి 30వ జాతీయస్థాయి కరాటే పోటీల్లోనీ విక్టరీ షోటోఖాన్ కరాటే అసోసియేషన్ డో ఇండియా వారు నిర్వహించిన పోటీల్లో 1500 విద్యార్థులపైగా పాల్గొన్నారు. బోయిన్ పల్లిలోని అంజయ్య నగర్ చెందిన సుబ్బు షోటోఖాన్ కరాటే అకాడమీ విద్యార్థులు లోహిత్, సంజయ్, విక్షిత, నిహారిక, గౌతమ్, మోహిత్, హనీ, కుశాల్ భూషణ్, అక్షిత్, సంకల్, పార్థు, శశి, విద్యార్థులకి గోల్డ్ సిల్వర్ బ్రౌన్స్, మెడల్స్, సాధించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సినీ హీరో ఇంద్రసేన హాజరై విద్యార్థులకు మెడల్స్ అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రతి ఒక్కరు కరాటి నేర్చుకోవాలని, కరాటే వల్ల కలిగే ప్రయోజనాలను విద్యార్థులకు తెలిపారు. బయట జరుగుతున్న మహిళలపై అత్యాచారాల గురించి తెలియజేస్తూ మహిళలకు కచ్చితంగా నేర్చుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఈ సందర్భంగా మాస్టర్స్ డి, సురేందర్, సుబ్బు, డీ. వంశీ మాట్లాడుతూ... విద్యార్థులు చేసిన ప్రాక్టీస్ వలన మెడల్స్ సాధించామని ఈ పోటీలో పథకాలు సాధించిన విద్యార్థులు అంతర్జాతీయ స్థాయిలో పథకాలు సాధించాలని అభినందించారు. ఈ కార్యక్రమంలో రేజుకి షోటోఖన్ కరాటే ఇండియా చీఫ్ మాస్టర్ నగేష్, నవీన్, బుర్రని శ్రీకాంత్, మామునూరు ప్రవీణ్, స్టిక్కర్స్ ఫౌండర్ అండ్ డైరెక్టర్ మాస్టర్ నాగరాజ్, నరసింహ, బబ్బి సిద్ధార్థ్, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.




## ఐనవోలు మల్లికార్జున స్వామి బ్రహ్మోత్సవాలకు సీఎం రేవంత్ రెడ్డి ఆహ్వానించిన మంత్రి సురేఖ, ఎమ్మెల్యే నాగరాజు

తెలంగాణ స్టేట్ బ్యూరో, రామారావు(శుభోదయం న్యూస్):



హైదరాబాద్ అసెంబ్లీ లోని గౌరవ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఛాంబర్ లో ఐనవోలు శ్రీ మల్లికార్జున స్వామి వారి బ్రహ్మోత్సవాలు సందర్భంగా జనవరి11 నుంచి 18 వరకు జరిగే బ్రహ్మోత్సవాల ) ఆహ్వాన పత్రికను గౌరవ తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ గృహ నిర్మాణాల మరియు పౌర సంబంధాల శాఖ & ఉమ్మడి వరంగల్ జిల్లా మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి, మరియు గౌరవ అటవీ పర్యావరణ, దేవాదాయ, శాఖల మంత్రివర్యులు కొండా సురేఖ ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగుల సంక్షేమ శాఖల మంత్రివర్యులు అడ్లూరి లక్ష్మణ్ గార్లతో కలిసి వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే విశ్రాంత ఐపీఎస్ అధికారి కే ఆర్ నాగరాజు ముఖ్యమంత్రిని బ్రహ్మోత్సవాలకు హాజరుకావాల్సిందిగా ఆహ్వాన పత్రికను అందజేశారు తొలుత మంత్రి సురేఖ స్వామి వారి శేషవస్త్రాన్ని సీఎంకి అందజేయగా, ఆలయ ప్రధాన అర్చకులు వేదమంత్రోచ్ఛారణలతో సీఎం ఆశీర్వదించి స్వామివారి చిత్రపటంతో పాటు తీర్థ ప్రసాదాలను అందజేశారు.ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ కమ్మగోని ప్రభాకర్ గౌడ్, ఈవో సుధాకర్, అర్చకులు నరేష్, శ్రీనివాస్ తో పాటు నందనం గ్రామ సర్పంచ్ జెట్టబోయిన రాజు, మహమ్మద్ చోటే తో పాటు తదితరులు పాల్గొన్నారు....

## హోర్డింగ్‌లో చిక్కుకున్న పక్షిని కాపాడిన బోయినపల్లి ట్రాఫిక్ పోలీసులు

తెలంగాణ స్టేట్ బ్యూరో, దొమ్మాటి శివకుమార్(శుభోదయం న్యూస్):




ట్రాఫిక్ నియంత్రణకే పరిమితమయ్యేది కాదు పోలీస్ విధి అని మరోసారి నిరూపించారు బోయినపల్లి ట్రాఫిక్ పోలీసులు. జాతీయ పక్షి దినోత్సవం సందర్భంగా బోయినపల్లి ఎక్స్‌రోడ్స్ వద్ద ఉన్న ఒక ప్రకటన హోర్డింగ్‌పై గాలిపటం మాంజా దారం లో చిక్కుకుని ప్రాణాపాయ స్థితిలో ఉన్న ఒక పావురాన్ని ట్రాఫిక్ పోలీసులు సాహసోపేతంగా కాపాడారు. హోర్డింగ్‌పై పక్షి చిక్కుకున్నట్టు గమనించిన హోం గార్డ్ ఎస్. గోపాల్ (హెచ్ జి 3017) చలించిపోయి వెంటనే హోర్డింగ్‌పైకి ఎక్కి పక్షిని సురక్షితంగా విడిపించారు. మరో హోం గార్డ్ మి.డి. అఫ్సర్ (హెచ్ జి 7281) కింద నుంచి అవసరమైన సహకారం అందిస్తూ పక్షిని జాగ్రత్తగా క్రిందకు తీసుకువచ్చారు.అనంతరం పావురం రెక్కలు, మెడకు చుట్టుకున్న చైనా మాంజాను తొలగించి ప్రాథమిక చికిత్స అందించారు. పూర్తిగా కోలుకున్న అనంతరం ఆ పక్షిని స్వేచ్ఛగా వదిలిపెట్టారు. ఈ మొత్తం రక్షణ చర్యల సమయంలో ట్రాఫిక్‌కు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పోలీసులు చర్యలు తీసుకోవడం గమనార్హం.ఈ ఘటనను చూసిన వాహనదారులు తమ మొబైల్ కెమెరాల్లో దృశ్యాలను బంధించి సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంతో వీడియో నెట్టింట వేగంగా వైరల్‌గా మారింది.ట్రాఫిక్ పోలీసుల మానవీయతకు నెటిజన్లు ప్రశంసలు కురిపిస్తున్నారు. ఈ ప్రశంసనీయమైన సేవలను గుర్తించి ఏసీపీ శంకర్ రాజు, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ జి. జనకి రాములు ఏసీపీ కార్యాలయంలో హోం గార్డులను సత్కరించి అభినందించారు. ఇలాంటి సేవలను మరింత ప్రోత్సహించేందుకు సంబంధిత హోం గార్డుల పేర్లను రివార్డ్ రోల్ కోసం ఉన్నతాధికారులకు సమర్పించనున్నట్లు తెలిపారు.

## మీ 24 న్యూస్ క్యాలెండరు ను ఆవిష్కరించిన జెడ్పి మాజీ చైర్ పర్సన్,గద్వాల నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి సరిత తిరుపతయ్య గారు

గద్వాల్, జిల్లా ప్రతినిధి -రమేష్(శుభోదయం న్యూస్) :





సోమవారం సరితమ్మ కాంగ్రెస్ పార్టీ క్యాంపు కార్యాలయం లో కొండాపురం మాజీ సర్పంచ్ మహానంది రెడ్డి జయమ్మ ఫొటోస్ తో మీ 24 న్యూస్ లో ముద్రించిన క్యాలెండరు ను సరితమ్మ చేతుల మీదుగా ఆవిష్కరించారు ఈ సందర్భంగా మీ 24 న్యూస్ రిపోర్టర్ రమేష్ కుమార్ కు శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు అదే విదంగా సరిత తిరుపతయ్య కొండాపురం మాజీ సర్పంచ్ మహానంది రెడ్డి జయమ్మ కు అదే విదంగా మీ 24 న్యూస్ రిపోర్టర్ రమేష్ కుమార్ కు శుభాకాంక్షలు తెలియజేశారు... ఈ సందర్భంగా సరితమ్మ మాట్లాడుతూ :రానున్న రోజుల్లో మీ 24 న్యూస్ గద్వాల్ జిల్లా లో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు అదే విదంగా మీ 24 న్యూస్ యజమాన్యానికి నూతన సంవత్సర శుభాకాంక్షలు ఆమె తెలియజేశారు...ఈ కార్యక్రమంలో కొండాపురం మాజీ సర్పంచ్ మహానంది రెడ్డి కేటి దొడ్డి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పాతాళం ఆనంద్ గౌడ్ మాజీ ఎంపిటీసీ కొండాపురం పద్మా రెడ్డి చాకలి నరేష్ బి. విరేష్ వడ్డే వెంకట్ రాములు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు....!!!

# అఖిలపక్షం సమావేశంలో వార్డుల వారీగా ఓటర్ల జాబితా పరిశీలన

**సమగ్రంగా అధికారులతో సర్వే చేయించాలి**
**- అఖిలపక్షం నాయకులు**

నాగార్జునసాగర్, జనవరి 5 (శుభోదయం న్యూస్):



నాగార్జునసాగర్ నందికొండ మున్సిపాలిటీ పరిధిలో ఉన్న 12 వార్డులలో ఓటర్ల జాబితాను పారదర్శకంగా, నిబంధనల ప్రకారం తప్పుల తడకలు లేకుండా పరిశీలన చేయాలని అదనపు కలెక్టర్( స్థానిక సంస్థలు )మున్సిపల్ ప్రత్యేక అధికారి వై. అశోక్ రెడ్డి ఆదివారం అధికారులను ఆదేశించిన విషయం తెలిసినదే,దానిలో భాగంగా సోమవారం నందికొండ మున్సిపాలిటీ కమిషనర్ చింతా వేణు అధ్యక్షతన అఖిల పక్షం సమావేశం ఏర్పాటు చేసిన అధికారులు మూసాయిదా ఓటర్ జాబితాను ప్రదర్శించారు అఖిలపక్ష నాయకులు అభ్యంతరం తెలియచేస్తూ కొన్ని చోట్ల ఒక వార్డ్ లో ఉండాల్సిన ఓట్లు మరో వార్డులో ఉన్నాయని, మరొక వైపు సాధారణ ఎన్నికల ఓటరు జాబితాలో ఉన్నటువంటి పేర్లు తాజా గా ఎన్నికల సంఘం పోర్టల్ లో చూపించటం లేదని వాపోయారు.

**నూతన ఓటర్ల పరిస్థితి అయోమయం**

పురపాలక సంఘం ఎన్నికల ముందు నూతన ఓటర్లు అన్ని వార్డులలో 18 సంవత్సరా లు నిండిన యువతి యువకులు అత్యధికంగా ఓటు నమోదు చేసుకోవటం జరిగిందని కానీ జాబితాలో లేక పోవటం అధికారుల నిర్లక్ష్యాన్ని తెలియచేస్తుందని నూతన ఓటర్ల విషయంలో సంధిగ్ధం నెలకొందని వారు ఆవేదన వ్యక్తం చేసారు.అంతే కాకుండా కొన్ని వార్డులలో 5,10 సంవత్సరాల క్రితం మరణించిన వారి వివరాలు ఇంకా జాబితాలోనే ఉన్నాయని శాశ్వతంగా వలస వెళ్లిన వారు,వివాహం అయిన మహిళలు పేర్లు ఇంకా కొనసాగుతున్నాయని,కొన్ని వార్డులలో డబల్ ఎంట్రీ చేశారని,కొంత మంది ఓటర్ల పేర్లు వేరే వార్డులో ఉన్నాయని ఇలాంటి సమస్యలను వార్డ్ అధికారులు,బూత్ లెవెల్ అధికారులు తక్షణమే అన్ని వార్డులలో ఇంటింటికి తిరిగి క్షుణ్ణశీగా పరిశీలించి ఓటర్ల జాబితాలో తప్పుల తడకలు లేకుండా సర్వే చేయించి రాబోవు పురపాలక సంఘం ఎన్నిక సజావుగా జరిగేటట్లు చూడాలని వారు ఈ సందర్భంగా కోరారు.

**కమిషనర్ వివరణ**

అఖిలపక్షం సమావేశం ముగిసిన అనంతరం ఆయన మాట్లాడుతూ వార్డులలో ఎలాంటి పొరపాట్లు లేకుండ అధికారులతో పూర్తిస్థాయిలో ఇంటింటికి తిరిగి సర్వే చేయించి ఏమైనా లోపాలుంటే సరిదిద్దుకుంటామని తెలియ చేసారు.ఈ కార్యక్రమంలో కమిషనర్ తో పాటు అఖిలపక్షం నాయకులు మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

సిద్దిపేట జిల్లా జనవరి 5, (శుభోదయం న్యూస్):



కమిషనర్ ఆఫ్ పోలీస్ సిద్దిపేట ఆదేశానుసారం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న రోడ్ సురక్ష అభియాన్/ రహదారి భద్రత అభియాన్ ప్రోగ్రాంలో భాగంగా సిద్దిపేట ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ కె ప్రవీణ్ కుమార్,సిద్దిపేట పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థుల విద్యార్థులకు రోడ్డు భద్రత ట్రాఫిక్ రూల్స్ గురించి చెప్పడం జరిగింది.మైనర్ డ్రైవింగ్ ప్రమాదకరం చట్ట ప్రకారం నేరం,రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి,మానవ తప్పిదం వల్లే రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. రోడ్డు నిబంధనలు ట్రాఫిక్ నిబంధనలు పాటించి పాటించి వాహనాలు నడిపి క్షేమంగా గమ్యస్థానాలకు చేరుకోవాలి విద్యార్థిని విద్యార్థులు నేర్చుకున్న ట్రాఫిక్ నిబంధనలు రోడ్డు నిబంధనల గురించి తల్లిదండ్రులకు తెలియపరచాలని సూచించారు. సిద్దిపేట ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ ప్రవీణ్ కుమార్, మాట్లాడుతూ పోలీస్ కమిషనర్, ఆదేశానుసారం విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలు, రోడ్డు నిబంధనల గురించి అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు.విద్యార్థి దశ నుండి ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే ప్రమాదాలు నివారించవచ్చని సూచించారు. మైనర్లు ఎట్టి పరిస్థితుల్లో కూడా వాహనాలు నడపవద్దని తెలిపారు. కారణము లేని మరణం ఒక రోడ్డు ప్రమాదం మాత్రమే వాహనదారులు తప్పకుండా రోడ్డు నిబంధనలు ట్రాఫిక్ నిబంధనలు పాటించి రోడ్డు ఇరువైపులా ఏర్పాటుచేసిన సైనింగ్ బోర్డ్స్ సూచనలు సలహాలు పాటిస్తూ సేఫ్టీ గా డ్రైవింగ్ చేసి క్షేమంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని సూచించారు. వేగంగా వెళ్లే వాహనానికి, సాధారణ స్పీడ్ తో వెళ్లే వాహనానికి తేలిక 15 నిమిషాలు మాత్రమే తేడా ఉంటుందని తెలిపారు.మోటార్ సైకిల్ వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలని, కారు నడిపేటప్పుడు సీటు బెల్టు ధరించాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణ గురించి ప్రతి సంవత్సరం భద్రత వారోత్సవాలు ద్వారా ప్రజలకు అవగాహన కల్పించడం జరుగుతుందని తెలిపారు. వాహనదారులు ప్రజలలో మార్పు వచ్చినప్పుడు మాత్రమే రోడ్డు ప్రమాదాలు తగ్గుతాయని తెలిపారు. రోజురోజుకు వాహనాల రద్దీ పెరుగుతుందని దాన్ని దృష్టిలో ఉంచుకొని సేఫ్టీ సెక్యూరిటీగా డ్రైవింగ్ చేయాలని సూచించారు. రాంగ్ రూట్లో ఎట్టి పరిస్థితుల్లో వాహనం నడపవద్దని తెలిపారు. పార్కింగ్ ప్రదేశాలలో వాహనాలు పార్కు చేసుకోవాలని రోడ్డుకు అడ్డదిడ్డంగా వాహనాలు పార్కు చేయవద్దని తెలిపారు.జరిమానా ఫైన్లు వేయడం మా అభిమతం కాదని ప్రమాదాల నివారణ గురించి రోడ్డు నిబంధనలు ట్రాఫిక్ నిబంధనలు పాటించని వారిపై మాత్రమే జరిమానాలు విధించడం జరుగుతుందని తెలిపారు. ప్రతి వాహనదారుడు రోడ్డు నిబంధనలు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు.ట్రాఫిక్ నిబంధనలకు సంబంధించిన సిగ్నల్స్ రోడ్డు నిబంధనలు, ట్రాఫిక్ నిబంధనలు, సిగ్నల్స్ ఎలా ఉంటాయి, ఎలా పాటించాలి అనే అంశంపై ట్రాఫిక్ సిగ్నల్ చూపిస్తూ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జి. సునీత, వైస్ ప్రిన్సిపాల్, ఎన్ సి సి, ఇంచార్జ్ కృష్ణయ్య మరియు కానిస్టేబుల్ అఖిల్, పాల్గొన్నారు.

# సిద్దిపేట జిల్లా రవాణా శాఖ అధికారి వి.లక్ష్మణ్ స్థానిక రవాణా శాఖ కార్యాలయంలో సమావేశం

సిద్దిపేట జిల్లా,జనవరి 5, (శుభోదయం న్యూస్):




జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల్లో భాగంగా సిద్దిపేట ప్రవేట్ స్కూల్స్ అసోసియేషన్ సంఘాల ప్రతినిధులతో సిద్దిపేట జిల్లా రవాణా శాఖ అధికారి వి.లక్ష్మణ్ సోమవారం స్థానిక రవాణా శాఖ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్కూల్ యాజమాన్యనానికి పలు రహదారి భద్రత సూచనలు చేయడం జరిగింది.అందులో భాగంగా ప్రతి పాఠశాల బస్సులో ఫస్ట్-ఎయిడ్ బాక్స్, ఫైర్ ఎక్స్టింగ్విషర్ తప్పనిసరిగా కలిగి ఉండాలని కిటికీలకు అడ్డంగా గ్రిల్స్ అత్యవసర ద్వారం ఉండాలని ,ప్రతి బస్సులో తప్పనిసరిగా అటెండర్ అవసరం ,అని డ్రైవర్లు సెల్ ఫోన్ మాట్లాడుతూ వాహనం నడుప్తున్నారా లేదా అతివేగం తో నడుపుతున్నారా అన్న విషయాన్ని పిల్లల నుండి ప్రతి రోజు సమాచారం సేకరించి డ్రైవర్స్ కి తగు సూచనలను చేయాలని పేర్కొన్నారు. పిల్లల భద్రతకు సంబంధించి ప్రతి యాజమాన్యం అన్ని రహదారి భద్రతా ప్రమాణాలను నిబంధనలను పాటించడం ద్వారా విద్యార్థుల భద్రతను పెంచవచ్చు ప్రమాదాలను నివారించవచ్చు. అని సూచించారు.ప్రభుత్వ ఆదేశాను సారము పాఠశాల యాజమాన్యం ద్వారా ప్రతి పాఠశాల విద్యార్థి తల్లి తండ్రులకు రహదారి భద్రతకు సంబంధించి ప్రమాణ పత్రం ప్రతిజ్ఞ పత్రం అందించడం జరిగింది .ఈ కార్యక్రమం లో డి టి ఓ, లక్ష్మణ్, తో పాటు,ఎం వి ఐ పి శంకర్ నారాయణ,ఏ ఎం వి ఐ శ్రీకాంత్ రెడ్డి,ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్సభ్యులు ట్రాస్మా, ప్రెసిడెంట్ శ్రీనివాస్ బడ్జెట్ స్కూల్స్ మేనేజ్మెంట్ ప్రెసిడెంట్ జే మల్లారెడ్డి , టి పి ఎస్ ఏ, ప్రెసిడెంట్ భగవాన్ రెడ్డి ఇతర సభ్యుల పాల్గొన్నారు. సిద్దిపేట మోటార్ వెహికల్స్ ఇన్స్పెక్టర్ శ్రీ పి శంకర్ నారాయణ సాయంత్రం పలు పాఠశాల బస్ లను తనికి చేయడం జరిగింది..ఇందులో భాగంగా డ్రైవర్స్ లకి అతి వేగంగా బస్ నడపవొద్దని పరిమితికి మించి పిల్లలను ఎక్కించుకోవొద్దని,సెల్ ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయవొద్దని,విధిగా డ్రైవర్ యూనిఫార్మ్ ధరించాలని సమయాను సారం లైసెన్స్ రెన్యువల్ చేసుకోవాలని బస్ కి సంబంధించిన ఫిట్నెస్, ఇన్స్యూరెన్స్, పర్మిట్ వంటి పత్రాలను వెంటే ఉంచుకోవాలని సూచించారు..

## మీ 24 న్యూస్ క్యాలెండరు ను ఆవిష్కరించిన గద్వాల్ ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి

గద్వాల్, జిల్లా ప్రతినిధి -రమేష్(శుభోదయం న్యూస్) :



గద్వాల్ ఎమ్మెల్యే పార్టీ క్యాంపు కార్యాలయం లో కొండాపురం సర్పంచ్ ఎస్. పవన్ కుమార్ గద్వాల్ ఎమ్మెల్యే ఫొటోస్ తో మీ 24 న్యూస్ లో ముద్రించిన క్యాలెండరు ను గద్వాల్ ఎమ్మెల్యే చేతుల మీదుగా ఆవిష్కరించారు ఈ సందర్భంగా కొండాపురం గ్రామ సర్పంచ్ ఎస్ పవన్ కుమార్ కు మీ 24 న్యూస్ రిపోర్టర్ రమేష్ కుమార్ కు శు భాకాంక్షలు తెలియజేశారు అదే విదంగా గద్వాల్ ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి మాట్లాడుతూ : మీ 24 న్యూస్ గద్వాల్ జిల్లాలో మంచి పేరు తెచ్చుకోవాలని అన్నారు అదే విదంగా ప్రజల మధ్య ఉంటూ సమస్యలపై నా వార్తలతో ముందుకు పోవాలి అని అన్నారు ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా డైరెక్టర్ సుభాన్, జిల్లా సర్పంచులు సంఘం అధ్యక్షుడు రాజశేఖర్, సర్పంచ్ పవన్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ మురళి, నాయకులు శేఖర్ రెడ్డి తిమ్మారెడ్డి, చంద్రశేఖర్, శ్రీరాములు ,మోబిన్, మధు అమరేష్, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మీ 24 న్యూస్ క్యాలెండరు ను ఆవిష్కరించిన డి.కే సిగ్న రెడ్డి

గద్వాల్, జిల్లా ప్రతినిధి -రమేష్(శుభోదయం న్యూస్) :



సోమవారం బిజెపి పార్టీ క్యాంపు కార్యాలయం లో కేటి దొడ్డి డి అశోక్ పార్లమెంటు సభ్యురాలు ఎంపీ డీకే అరుణమ్మ ఫొటోస్ తో మీ 24 న్యూస్ లో ముద్రించిన క్యాలెండరు ను డి. కే సిగ్న చేతుల మీదుగా ఆవిష్కరించారు ఈ సందర్బంగా మీ 24 న్యూస్ రిపోర్టర్ రమేష్ కుమార్ కు అదే విదంగా కేటి దొడ్డి డి అశోక్ కు శుభాకాంక్షలు తెలియజేశారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ : మీ 24 న్యూస్ క్యాలెండర్ లో పార్లమెంటు సభ్యురాలు ఎంపీ డీకే అరుణమ్మ ఫొటోస్ తో ముద్రించి అభిమానం చాటుకున్న కేటి దొడ్డి డి అశోక్ కు శుభాకాంక్షలు తెలియజేశారు అదే విదంగా ప్రతీ వార్తా ప్రజల సమస్యలపై ఉండాలి అని అన్నారు ముందు ముందు ఉన్నత స్థాయిలో మీ 24 న్యూస్ ఉండాలి అని ఆమె అన్నారు ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు సీనియర్ నాయకులు కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు....!!!

## ప్రజావాణి దరఖాస్తులను వేగంగా పరిష్కరించి ప్రజలకు న్యాయం చేయాలి

**: జిల్లా కలెక్టర్ కె. హైమావతి**

సిద్దిపేట జిల్లా, జనవరి 5, (శుభోదయం న్యూస్):



ప్రజావాణి దరఖాస్తులను వేగంగా పరిష్కరించి ప్రజలకు న్యాయం చేయాలని జిల్లా కలెక్టర్ కె. హైమావతి అధికారులను ఆదేశించారు. సోమవారం ఐడిఓసి కాన్ఫరెన్స్ హాల్లో ప్రజావాణి కార్యక్రమం ద్వారా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుండి వివిధ సమస్యలపై ఆర్జీలను స్వీకరించి వాటి పరిష్కారానికి సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమానికి వచ్చే ఆర్జీలను సంబంధిత శాఖల అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలించి తగిన చర్య తీసుకుంటే ప్రజలు ఎంతో సంతోషించి సంబంధిత అధికారుల సేవలను ఎప్పటికీ గుర్తుంచుకుంటారని ప్రతి ఒక్క అధికారి ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆదేశించారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమానికి వివిధ సమస్యలపై 126 అర్జీలు వచ్చాయి.ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ రెవిన్యూ అబ్దుల్ హమీద్, డిఆర్ఓ నాగరాజమ్మ, జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏవో తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ కార్యాలయంలో వినతిపత్రం అందజేసిన గజ్వేల్ ఆర్ అండ్ ఆర్ కాలనీవాసులు

సిద్దిపేట జిల్లా జనవరి 5, (శుభోదయం న్యూస్):



సిద్దిపేట జిల్లా గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ కార్యాలయంలో ఆర్ అండ్ ఆర్ కాలనీ ప్రజలతో కలిసి వినతి పత్రం అందజేసిన మాజీ సర్పంచ్ దామరంచ ప్రతాప్ రెడ్డి, మాజీ సర్పంచ్ కొలిచెలిమే స్వామి మాట్లాడుతూ మల్లన్న సాగర్ ముంపు గ్రామాల ప్రజలకు తీవ్ర అన్యాయం జరిగిందని మున్సిపల్ లో వార్డుల పునర్విభజనలో భాగంగా మా ఆర్ అండ్ ఆర్ కాలనీ ఓటర్లు వివిధ వార్డుల్లో కలిపారని ఎవరు ఏ వార్డులో ఉన్నారో అయోమయంగా ఉన్నారని ఆర్ అండ్ ఆర్ కాలనీ ప్రత్యేకంగా ఓటర్ల జాబితా తయారుచేసి మాకు ప్రత్యేకంగా వార్డులు కేటాయించాలని ఇప్పుడు 6 వార్డులు కేటాయించడం సంతోషంగా ఉందని కానీ ఆ 6 వార్డులు మా గ్రామాల వారికి చెందే విధంగా చూడాలని అధికారులకు విన్నవించడం జరిగిందని అన్నారు, ఈ కార్యక్రమంలో బాలకిషన్, నర్సింలు, పురుషోత్తం రెడ్డి, జహంగీర్, శ్రీనివాస్, కనక గౌడ్, తిప్పారమ్ కనకయ్య,నాగరాజు,పరుశురాం,ఈ స్వామి, తదితరులు పాల్గొన్నారు

# సీసీ కెమెరాలు పనిచేసేలా చర్యలు చేపట్టాలి





జిల్లా కలెక్టర్ కె. హైమావతి

సిద్దిపేట జిల్లా, జనవరి 5, (శుభోదయం న్యూస్):

అన్ని ప్రభుత్వ పాఠశాలలు, గురుకుల విద్యాలయాలు, కస్తూర్బా గాంధీ విద్యాలయాలు, సంక్షేమ హాస్టల్లో సీసీ కెమెరాలు పనిచేసేలా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ కె. హైమావతి ఆదేశించారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమానికి ముందు ఐడిఓసి కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా అధికారులతో నిర్వహించిన సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని ప్రభుత్వ విద్యాసంస్థల్లో సీసీ కెమెరాలు కచ్చితంగా పని చేసే స్థితిలో ఉండాలని అన్నారు. ఇప్పటి వరకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయని విద్యా సంస్థలలో వెంటనే ఏర్పాటు చేయాలని, ఇప్పటికే సీసీ కెమెరాలు ఉండి పనిచేయని వాటికి వెంటనే రిపేర్లు చేసి ఉపయోగంలోకి తీసుకురావాలని జిల్లా విద్యాశాఖ అధికారిని మరియు వివిధ గురుకులాల జిల్లా కోఆర్డినేటర్లను ఆదేశించారు. సత్యసాయి సేవా ట్రస్ట్ వారి సహకారంతో జిల్లాలోని అన్ని విద్యాసంస్థలలో విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని వైద్య, ఆరోగ్య మరియు విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం వద్ద కార్యాలయంలో పనిచేసే ఉద్యోగుల సౌకర్యార్థం ఆర్టీసీ బస్సులు ఆగేల చర్యలు తీసుకోవాలని, అదేవిధంగా జిల్లా వ్యాప్తంగా కాలేజీలు, స్కూల్ ల టైములకు ఆర్టీసీ బస్సులు నడిచేలా చర్యలు తీసుకోవాలని టిజిఎస్ ఆర్టిసి సిద్దిపేట డిపో మేనేజర్ ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ రెవిన్యూ అబ్దుల్ హమీద్, డిఆర్ఓ నాగరాజమ్మ, జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏవో తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ముగిసిన జాతీయ స్థాయి బాడీ బిల్డింగ్ పోటీలు

పటాన్చెరు (శుభోదయం న్యూస్):



పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి సౌజన్యంతో పటాన్చెరు డివిజన్ పరిధిలోని మైత్రి మైదానంలో ఏర్పాటు చేసిన జాతీయస్థాయి బాడీ బిల్డింగ్ ఛాంపియన్షిప్ పోటీలు ఆదివారం రాత్రి అట్టహాసంగా ముగిసాయి. వివిధ రాష్ట్రాల నుండి సుమారు 250 మందికి పైగా బాడీ బిల్డర్లు పోటీలలో పాల్గొని తమ దేహదారుడ్యాలను ప్రదర్శించారు. సోమవారం తెల్లవారుజాము వరకు హోరాహోరీగా పోటీలు కొనసాగాయి. పటాన్చెరు నియోజకవర్గం చరిత్రలోనే మొట్టమొదటిసారిగా నిర్వహించిన బాడీ బిల్డింగ్ ఛాంపియన్షిప్ పోటీలు అందరినీ అలరించాయి. బాడీ బిల్డర్ల ప్రదర్శన ప్రతి ఒక్కరిని మంత్రముగ్ధుల్ని చేశాయి. ఓవరాల్ బాడీబిల్డింగ్ ఛాంపియన్ గా ఓం ప్రకాష్, మెన్స్ ఫిజిక్ ఛాంపియన్ ఆఫ్ చాంపియన్ గా షోయబ్ లు ఘన విజయం సాధించారు. వీరికి 50 వేల రూపాయలు చొప్పున ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి సోదరుడు, సీనియర్ నాయకులు గూడెం మధుసూదన్ రెడ్డి, కుమారుడు గూడెం విక్రమ్ రెడ్డిల చేతులమీదుగా నగదు బహుమతులు, ట్రోఫీలు అందజేశారు. పోటీల ఏర్పాటులో కీలకపాత్ర పోషించిన ఓమర్, షకీల్.లను ప్రత్యేకంగా అభినందించారు. పటాన్చెరులో జాతీయ స్థాయి బాడీ బిల్డింగ్ పోటీలు నిర్వహించడం అభినందనీయం ఆంధ్రప్రదేశ్ శాప్ మాజీ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి పటాన్చెరు పట్టణంలో జాతీయస్థాయి బాడీ బిల్డింగ్ పోటీలు నిర్వహించడం అభినందనీయమని క్రీడల పట్ల అమితమైన ఆసక్తి కలిగిన ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ఉండటం నియోజకవర్గం ప్రజల అదృష్టమని ఆంధ్రప్రదేశ్ స్పోర్ట్స్ అథారిటీ మాజీ చైర్మన్, వైయస్సార్సీపి సీనియర్ నాయకులు బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి అన్నారు. జిఎంఆర్ క్లాసిక్ జాతీయ బాడీ బిల్డింగ్ పోటీల కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో ప్రతి ఒక్కరూ క్రికెట్ లాంటి క్రీడల పట్ల మక్కువ చూపుతున్నారని ఇలాంటి సమయంలో బాడీ బిల్డింగ్ అంశంలో ప్రతి ఒక్కరికి అవగాహన కల్పిస్తూ వారిలో ఆసక్తి పెంపొందించేలా జాతీయ స్థాయి పోటీలను ఏర్పాటు చేసిన ఎమ్మెల్యే మైపాల్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## పొగ మంచులో ప్రయాణం, జాగ్రత్తలు తప్పనిసరి:

ట్రాఫిక్ ఏసిపి సుమన్ కుమార్

**సిద్దిపేట :** ప్రయాణాలు ఎంత ముఖ్యమో వాహనదారులు నిబంధనలు పాటించడం కూడా అంతే ముఖ్యం వాహనదారులు జాగ్రత్తలు పాటించాలి.ప్రజల భద్రతే పోలీస్ లక్ష్యంరహదారుల వెంట పోలీస్ నిరంతర పెట్రోలింగ్.నిభందనలు పాటించడం, ముందు జాగ్రత్తలు తీసుకోవడం తో ప్రమాదాల నుండి రక్షణ పొందవచ్చు.సిద్దిపేట ట్రాఫిక్ ఏసిపి సుమన్ కుమార్..చలికాలం సందర్భంగా సిద్దిపేట జిల్లా వ్యాప్తంగా చలి తీవ్రత పెరిగిందని పొగమంచు పడే వేళల్లో రాత్రిళ్ళు, తెల్లవారు జామున వాహనాలు నడిపేవారు అప్రమత్తంగా ఉండాలని, పొగమంచు ప్రభావం వల్ల రహదారులపై ముందు ఉన్న వాహనాలు కనిపించకపోవడం వలన ప్రమాదలు జరిగే అవకాశం ఉందన్నారు.చలిలో ప్రయాణం కొన్ని సందర్భాల్లో ప్రమాదాలకు గురి కావచ్చు కావున వాహనదారులు రోడ్లపై ముందస్తు జాగ్రత్తలు పాటించాలని అన్నారు.జిల్లా వ్యాప్తంగా రహదారుల వెంట నిరంతర పోలీస్ పెట్రోలింగ్ నిర్వహిస్తున్నం, వాహనదారులు లైటింగ్ కండిషన్ చూసుకోవాలి, తక్కువ వేగంతో డ్రైవ్ చేయాలి,

## కొండపాక మండలం మర్పడగ గ్రామంలో జిల్లా కలెక్టర్ కె హైమావతి పలు పర్యటనలు

సిద్దిపేట జిల్లా, జనవరి 5, (శుభోదయం న్యూస్):



కొండపాక మండలం మర్పడగ గ్రామంలో జిల్లా కలెక్టర్ కె హైమావతి పలు పర్యటనలు1. గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో మధ్యాహ్న బోజన ప్రక్రియను జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మెను ప్రకారం కిచిడీ, కూర, గుడ్డు వండినట్లు సిబ్బంది కలెక్టర్ కి తెలిపారు. వంట గది పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, విద్యార్థులకు రుచికరంగా వండాలని వంట సిబ్బందిని ఆదేశించారు. భోజనం చేస్తున్న విద్యార్థులతో ఆహారం బాగుందా రుచిగా వండుతున్నారా అని ఆప్యాయంగా పలకరించారు. కామన్ డైట్ మెనూ తప్పనిసరిగా పాటించాలని విద్యార్థులకు క్రమశిక్షణ తో చదువు నేర్పించాలని ప్రిన్సిపల్ ఉపాధ్యాయులను ఆదేశించారు. అసంపూర్తిగా ప్రహరీ గోడ, టాయిలెట్స్ నిర్మాణం ఉన్నాయని ప్రిన్సిపల్ కలెక్టర్ దృష్టికి తేగా సానుకూలంగా స్పందించిన జిల్లా కలెక్టర్ టాయిలెట్స్ పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత ఇంజనీరింగ్ అధికారులను ఫోన్ ద్వారా ఆదేశించారు. 2.గ్రామంలోని పల్లెదవాఖనా ను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. దవాఖాన మొత్తం కలియ తిరిగారు. లోపల చెత్త చెదారం లేకుండా శుభ్రం చేయించాలని పంచాయతీ సెక్రటరీని ఆదేశించారు. అటెండెన్స్ రిజిస్టర్ వెరిఫై చేశారు. రిజిస్టర్ లు తనికి చేశారు. గ్రామంలోని ప్రెగ్నెన్సీ మహిళల టిబి, షుగర్ పేషంట్ లను తరుచు మానిటర్ చెయ్యాలని తెలిపారు. 3. గ్రామంలో శానిటేషన్ డ్రైవ్ ను పరిశీలించారు. మోరీలలో చెత్త చెదారం ఉండి నీటి నిల్వలు చూసి అసహనం వ్యక్తం చేశారు. నీటి నిల్వలలో దోమలు రావడం వలన అంటువ్యాధులకు కేంద్రంగా ఉంటాయని వారం లోపు గ్రామం మొత్తం శానిటేషన్ డ్రైవ్ పూర్తి చెయ్యాలని పంచాయతీ కార్యదర్శి ను ఆదేశించారు.

## ప్రేమించి మోసం చేసి, ఆమె ఆత్మహత్యకు కారణమైన డాక్టర్ అరెస్ట్

సిద్దిపేట జిల్లా, జనవరి 5 (శుభోదయం న్యూస్):

సిద్దిపేట ఎ.సి.పి. రవీందర్ రెడ్డి విలేకరుల సమావేశం లో మాట్లాడుతూ సిద్దిపేట ప్రభుత్వ వైద్య కళాశాల ఆసుపత్రిలో హౌస్ సర్జన్‌గా పనిచేస్తున్న పేద దళిత కుటుంబానికి ఎంబీబీఎస్ విద్యార్థిని బి. లావణ్య (23) జోగులాంబ గద్వాల జిల్లా మానోపాడు మండలం జల్లా పురం గ్రామం మృతురాలు గవర్నమెంట్ సాంఘిక సంక్షేమ పాఠశాలలో చదివి తదుపరి హైదరాబాద్ గచ్చిబౌలి లో గల గౌలిదొడ్డి క్యాంపస్ నందు ఇంటర్ పూర్తి చేసి సిద్దిపేట ప్రభుత్వ మెడికల్ కాలేజీ నందు ఎంబీబీఎస్‌లో చేరినది. ఆమె ట్రాక్ రికార్డ్ ప్రకారంగా చదువులో, ఆటలలో చురుకుగా ఉన్నట్టుగా తెలుస్తుంది. ఆమె తల్లిదండ్రులు కూలిపనిచేస్తూ జీవిస్తున్నారు. అక్క శిరీష హైదరాబాద్ సాఫ్ట్ వేర్ గా జాబ్ చేస్తుండగా లావణ్య సిద్దిపేట ప్రభుత్వ మెడికల్ కాలేజీలో ఇంటర్న్‌షిప్ చేస్తోంది. అదే సిద్దిపేట ప్రభుత్వ మెడికల్ కాలేజీలో సీనియర్ రెసిడెంట్‌గా డాక్టర్ జనరల్ మెడిసిన్ చదువుచున్న సికింద్రాబాద్ ఆల్వాలకు చెందిన ప్రణయ్ తేజ్‌తో గత సంవత్సరం జూలై నెలలో పరిచయం ఏర్పడి ప్రేమ సంబంధంగా మారింది, వివాహం చేసుకుంటానని నమ్మించి సన్నిహితంగా మెలిగిన ప్రణయ్ తేజ్ కుల భేదం కారణంగా వివాహానికి నిరాకరించడంతో లావణ్య తీవ్ర మనస్తాపానికి గురై జనవరి 3న లావణ్య తీవ్ర మనోవేదనతో మెడికల్ కాలేజీ హాస్టల్ రూమ్ నందు గడ్డి నివారణకు వాడే పారాక్విట్ మందును సెలైన్ ఎక్కించే సూది ద్వారా ఇంజక్షన్ చేసుకోవడంతో అపస్మారక స్థితిలో ఉండగా తన రూం మేట్స్ గుర్తించి చికిత్స గురించి సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి, అక్కడి నుండి హైదరాబాద్ నిమ్స్‌కు తరలించగా, చికిత్స పొందుతూ నిమ్స ఆసుపత్రిలో మృతి చెందిననది. ఈ విషయంపై మృతురాలు అక్క శిరీష ఫిర్యాదు మేరకు సిద్దిపేట త్రీ టౌన్ ఇన్స్పెక్టర్ విద్యాసాగర్ కేసు నమోదు చేసి కేసును దర్యాప్తు ను ప్రారంభించి నిందితుని ఆచూకీ గురించి సిద్దిపేట త్రీ టౌన్ ఇన్స్పెక్టర్, ఎస్.ఐ వెంకటేశ్వర్లు టీంగా ఏర్పాటు చేసి పంపించగా నిందితుడైన ప్రణయ్ తేజ్ ను పట్టుకొని విచారణ ముద్దాయి బి.సి కంసాలి కులానికి చెందిన వ్యక్తి కాగా మృతురాలు దళిత సామాజిక వర్గానికి చెందినందున సెక్షన్ 108, 69 బి.ఎన్.ఎస్ మరియు ఎస్సీ / ఎస్టి చట్టం ప్రకారంగా అరెస్ట్ చేసి రిమాండ్ గురించి కోర్టుకు పంపించడం జరిగినదని అన్నారు. ఈ కేసును చదివించిన పోలీసులను ఆనందించారు.

## సమస్యల పరిష్కారంలో ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా నేటి దినపత్రిక సూర్య

బొల్లారం మాజీ కౌన్సిలర్ వి .చంద్రారెడ్డి

బొల్లారం : (శుభోదయం న్యూస్)



మారుతున్న కాలానికి అనుగుణంగా వినూత్నంగా పత్రికా రూపాంతరం చెందుతూ అటు ప్రజలకి ప్రభుత్వానికి మధ్య వారధిగా నిలుస్తున్న నేటి దినపత్రిక సూర్య ను మాజీ కౌన్సిలర్ వి. చంద్రారెడ్డి ప్రశంసించారు. సోమవారం బొల్లారంలో నేటి దినపత్రిక సూర్య 2026 క్యాలెండర్ ను ఆయన చేతులమీదుగా ఆవిష్కరించారు.ఈ సందర్భంగా వి.చంద్రారెడ్డి పత్రికా యజమాన్యానికి పాఠకులకు, జర్నలిస్టులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. పత్రికా రంగంలో ప్రజల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్న యజమాన్యానికి అభినందించారు. ఈ సందర్భంగా నేటి దినపత్రిక సూర్య జర్నలిస్ట్ యు.చంద్రశేఖర్ వి.చంద్రారెడ్డి ని ఘనంగా సన్మానించారు కార్యక్రమంలో గ్రేటర్ బొల్లారం అధ్యక్షుడు పి.జైపాల్ రెడ్డి, మాజీ కౌన్సిలర్లు గోపాలమ్మ రాములు, పి.చంద్రయ్య, నాయకులు బషీర్, మాజీ వార్డ్ మెంబర్ టి .భాస్కర్, మాజీ ఎంపిటిసి కృష్ణంరాజు, స్థానిక నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా పిసిసి అధికార ప్రతినిధి బండార్ శ్రీకాంత్ రావు జన్మదిన వేడుకలు

సిద్దిపేట జిల్లా, జనవరి 5, (శుభోదయం న్యూస్):



తెలంగాణ రాష్ట్ర పిసిసి అధికార ప్రతినిధి బండార్ శ్రీకాంత్ రావు జన్మదినం సందర్భంగా జగదేవపూర్ మండలం తిగుల్ గ్రామ మాజీ సర్పంచ్, గజ్వేల్ నియోజకవర్గం యువజన మాజీ అధ్యక్షులు కప్పర భాను ప్రకాష్ రావు ఆధ్వర్యంలో సోమవారం శ్రీ కొండపోచమ్మ దేవాలయం వద్ద జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు అంతకుముందు శ్రీ కొండపోచమ్మ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు,అనంతరం దేవాలయం ప్రాంగణంలో కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా భాను ప్రకాష్ రావు మాట్లాడుతూ ఇలాంటి జన్మదిన వేడుకలు ఎన్నో జరుపుకోవాలని నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో ఉండాలని జీవితంలో ఇంకా ఉన్నంత పదవులు పొందాలని మనస్పూర్తిగా అమ్మవారిని కోరుకుంటున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో కొండపోచమ్మ డైరెక్టర్ కోట ఆశయ, నరేష్, మాజీ సర్పంచ్ బిక్షపతి,నాచారం డైరెక్టర్ సంతోష్ పంతులు,మాజీ ఎంపిటిసి సావిత్రి నరసింహులు, సిద్దిపేట జిల్లా యువజన కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ,వార్డు సభ్యులు రాజు,గుర్రం ఎల్లం,సీనియర్ నాయకులు కిష్టయ్య, నర్సింలు, కొండయ్య, మహేష్, యువ జన నాయకులు స్వామి,రవి,వెంకట్, మనోజ్, రాజు,భాను చారి, తదితరులు పాల్గొన్నారు.

## పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత శ్రీనివాస్ చారి

సిద్దిపేట జిల్లా, జనవరి 5, (శుభోదయం న్యూస్):




పరిసరాల పరిశుభ్రత వ్యక్తిగత పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ గజ్వేల్ పట్టణ అధ్యక్షులు శ్రీనివాస్ చారి అన్నారు సోమవారం సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలం గిరిపల్లి గ్రామంలో గజ్వేల్ ప్రభుత్వ మహిళ డిగ్రీ కళాశాల విద్యార్థినిలు జాతీయ సేవా పథకం ( ఎన్ ఎస్ ఎస్) లో భాగంగా గ్రామంలో స్వచ్ఛత ర్యాలీ నిర్వహించారు ఈ కార్యక్రమంలో పాల్గొన్న నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ గజ్వేల్ పట్టణ అధ్యక్షులు శ్రీనివాస్ చారి మాట్లాడుతూ, గ్రామాలు దేశానికి పట్టుకొమ్మలు అని గ్రామాల ప్రజలు, వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఆయన సూచించారు, గ్రామాలలో పరిశుభ్రత,పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కలు నాటాలని వివరిస్తూ క్యాంపులు నిర్వహించడం అభినందనీయమని అన్నారు.

## అయ్యప్ప స్వామి దేవాలయంలో ముగిసిన అన్న ప్రసాద వితరణ

సిద్దిపేట జిల్లా, జనవరి 5, (శుభోదయం న్యూస్):



సిద్దిపేట జిల్లా గజ్వేల్ లోని ప్రముఖ ఆలయం అయ్యప్ప స్వామి ఆలయంలో గత 41 రోజులుగా ప్రతిరోజు అన్నప్రసాదం,అల్పాహారం దాతల సహకారంతో పంపిణీ చేయడానికి సహకరించిన ప్రతి ఒక్కరికి ఒక ప్రకటన లో ధన్యవాదాలు తెలిపిన ఆలయ కమిటీ అధ్యక్షులు ఎర్రం శ్రీనివాస్ గురుస్వామి, ఈ సందర్భంగా కొండపోచమ్మ దేవస్థానం మాజీ డైరెక్టర్ అయిత సత్యనారాయణ మాట్లాడుతూ హరిహర పుత్ర అయ్యప్ప స్వామి అనుగ్రహంతో అందరూ బాగుండాలని,దాదాపు 41 రోజులుగా అల్పాహారం,అన్న ప్రసాదం అందజేసే కార్యక్రమంలో పాల్గొనడం సంతోషంగా ఉందని ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ఉపాధ్యక్షులు దుర్గం స్వామి, ప్రధాన కార్యదర్శి రవీందర్,కోశాధికారి నారాయణ రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు, బొగ్గుల సురేష్ స్వామి, కైలాస ప్రశాంత్ గందే సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

## గీతాంజలి రోబోటిక్ స్కూల్ లో క్యాలెండర్ ఆవిష్కరణ

పటాన్చెరు: (శుభోదయం న్యూస్)



2026 వ సంవత్సర నూతన క్యాలెండర్ ను గీతాంజలి రోబోటిక్ పాఠశాల ఇస్నాపూర్ లో సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు గౌరి మాట్లాడుతూ క్యాలెండర్ విద్యార్థులలో,సమయపాలన, క్రమశిక్షణ, లక్ష్య సాధనలో మార్గదర్శకంగా ఉంటుందని తెలిపారు. నూతన సంవత్సరం విద్యార్థులలో కొత్త ఆశలు చిగురించేలా, కొత్త లక్ష్యాలను, నిర్దేశించుకొనేలా, ఉత్తమ భవిష్యత్తుకు పునాది వేసుకునేలా సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో శ్రీ శ్లోకా ఇంటర్నేషనల్ స్కూల్ నిర్వాహకులు కొత్వాల్ హరికృష్ణా రెడ్డి, గ్లోరియస్ గ్రూపు పాఠశాలల నిర్వాహకులు గోరు సింహాచలం, ఉపాధ్యాయురాళ్ళు, పాఠశాల సిబ్బంది పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.




# లైన్ క్లియర్.. సాయిపల్లవి హిందీ డెబ్యూ సినిమా రిలీజ్‌పై

మూవీ లవర్స్‌కు పెద్దగా ఇంట్రడక్షన్ అవసరం లేని భామ సాయిపల్లవి. ఈ కోలీవుడ్ అమ్మడు తెలుగు, తమిళం, మలయాళంలో సినిమాలు చేస్తూ సూపర్ ఫ్యాన్ బేస్ సంపాదించుకుంది. ఇక హిందీలో కూడా సాయిపల్లవి తన లక్‌ను పరీక్షించుకునేందుకు రెడీ అవుతుందని తెలిసిందే. బాలీవుడ్ స్టార్ హీరో అమీర్ ఖాన్ కుమారుడు జునైద్ ఖాన్ నటిస్తోన్న మేరే రహో సినిమాలో సాయిపల్లవి ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. ఈ చిత్రాన్ని 2025లో ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని ప్లాన్ చేశారు మేకర్స్. తాజాగా కొత్త రిలీజ్ డేట్ ఫైనల్ చేశారన్న వార్త బయటకు వచ్చింది. లేటెస్ట్ టాక్ ప్రకారం మేరే రహో చిత్రాన్ని జులై రెండో వారంలో విడుదల చేయబోతున్నారట. రిలీజ్ డేట్‌పై మేకర్స్ రానున్న రోజుల్లో క్లారిటీ ఇవ్వనున్నారని బీటౌన్ సర్కిల్ ఇన్‌సైడ్ టాక్. మొత్తానికి సాయిపల్లవి ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న హిందీ డెబ్యూ మూవీ ఈ ఏడాది సెకండాఫ్‌లో థియేటర్లలో సందడి చేయనుందన్న వార్తను ఫుల్ ఎంజాయ్ చేస్తున్నారు అభిమానులు, మూవీ లవర్స్. 2025లో తండేల్ సినిమాతో ప్రేక్షకుల ముందుకొచ్చింది సాయిపల్లవి. ఈ భామ ఖాతాలో మరో మోస్ట్ అవెయిటెడ్ ప్రాజెక్ట్ రామాయణ ఉంది. ఈ మూవీ రెండు పార్టులుగా రాబోతుంది. రొమాంటిక్ డ్రామా నేపథ్యంలో వస్తోన్న మేరే రహో మూవీని సునీల్ పాండే డైరెక్ట్ చేస్తున్నాడు.



# మృణాళ్ ఠాకూర్‌ను హైదరాబాద్ పిలుస్తోందట.. ఇంతకీ ఎందుకో తెలుసా మరి?

టాలీవుడ్ హీరో అడివిశేష్ మృణాల్ ఠాకూర్ కాంబినేషన్‌లో డెకాయిట్ సినిమా వస్తోన్న విషయం తెలిసిందే. షనీల్ డియో కథనందిస్తూ డైరెక్ట్ చేస్తున్న ఈ చిత్రం ఇప్పటికే ప్రేక్షకుల ముందుకు రావాల్సి ఉండగా.. మేకర్స్ ఫైనల్‌గా ఈ మూవీని ఉగాది కానుకగా మార్చి 19న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేస్తున్నట్టు ప్రకటించారు. తాజాగా ఈ సినిమా షూటింగ్ గురించి క్రేజీ అప్‌డేట్ షేర్ చేసింది మృణాళ్ ఠాకూర్. డెకాయిట్ ఫైనల్ షెడ్యూల్ పూర్తి చేసేందుకు తాను హైదరాబాద్‌కు వెళ్తున్నానని ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసింది. ఈ పోర్షన్‌తో మృణాళ్ ఠాకూర్‌కు సంబంధించిన పార్ట్ పూర్తి కానుంది. హైదరాబాద్ పిలుస్తోంది.. అంటూ మృణాళ్ ఠాకూర్ షేర్ చేసిన ఈ పోస్ట్ నెట్టింట వైరల్ అవుతోంది. ఈ చిత్రంలో బాలీవుడ్ దర్శకుడు, నటుడు అనురాగ్ కశ్యప్ టాలీవుడ్ ఎంట్రీ ఇస్తున్నాడు. ప్రకాశ్ రాజ్ మరో కీలక పాత్రలో నటిస్తున్నాడు. డెకాయిట్ చిత్రాన్ని అన్నపూర్ణ స్టూడియోస్ సమర్పణలో సుప్రియా యార్లగడ్డ నిర్మిస్తుండగా.. సునీల్ నారంగ్ కో ప్రొడ్యూసర్‌గా వ్యవహరిస్తున్నాడు. అడివిశేష్ హీరోగా నటించిన క్షణం, గూఢచారి చిత్రాలకు సినిమాటోగ్రఫర్‌గా పనిచేసిన షనీల్ డియో ఈ చిత్రాన్ని డైరెక్ట్ చేస్తుండటంతో అంచనాలు భారీగానే ఉన్నాయి. ఇప్పటికే విడుదల చేసిన టీజర్‌పై సినిమాపై సూపర్ బజ్ క్రియేట్ చేస్తోంది.



# 'వారణాసి' రిలీజ్ డేట్ ఫిక్స్ .. అంతర్జాతీయ వేదికపై అరుదైన రికార్డు దిశగా..

సూపర్ స్టార్ మహేష్ బాబు, దర్శకధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న పాన్ వరల్డ్ అడ్వెంచర్ ప్రాజెక్ట్ 'వారణాసి' పై ప్రపంచవ్యాప్తంగా భారీ అంచనాలు నెలకొన్నాయి. భారతీయ సినిమా స్థాయిని మరో మెట్టు ఎక్కించబోయే ఈ చిత్రం కోసం సినీ అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఇప్పటికే 2027 సమ్మర్‌లో విడుదల చేస్తామని రాజమౌళి అధికారికంగా వెల్లడించగా, తాజాగా ఈ మూవీకి సంబంధించి రిలీజ్ డేట్ దాదాపుగా ఖరారైనట్లు ఇండస్ట్రీ వర్గాలు చెబుతున్నాయి. తాజా సమాచారం ప్రకారం 2027 ఏప్రిల్ 9న 'వారణాసి'ని ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. శ్రీరామ నవమి రోజున ప్రేక్షకుల ముందుకు తీసుకువస్తే సినిమాకు మరింత ఆధ్యాత్మిక బలం చేకూరుతుందని టీమ్ భావిస్తున్నట్టు సమాచారం. దీనిపై త్వరలోనే అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉందని సినీ వర్గాలు అంటున్నాయి. 'రామాయణం'లోని ఒక కీలక ఘట్టాన్ని ఆధారంగా చేసుకొని ఈ సినిమాను తెరకెక్కిస్తున్నట్లు రాజమౌళి ఇప్పటికే వెల్లడించారు. ఇందులో మహేష్ బాబు శ్రీరాముడిగా కనిపించనున్నారని ప్రచారం సాగుతోంది. ఇప్పటికే విడుదలైన గ్లింప్స్‌లో ఆయన 'రుద్ర' అవతారంలో దర్శనమివ్వగా, ఆ లుక్ సోషల్ మీడియాలో సంచలనం సృష్టించింది. కేవలం టైటిల్ గ్లింప్స్‌తోనే అంతర్జాతీయ స్థాయిలో సినిమాపై ఆసక్తి పెరిగింది. ఈ ప్రాజెక్ట్ ప్రమోషన్లు రిలీజ్‌కు రెండేళ్ల ముందే ఇంటర్నేషనల్ లెవల్‌లో మొదలయ్యాయి. తాజాగా ఈ మూవీ అనౌన్స్‌మెంట్ టీజర్‌ను పారిస్‌లోని ప్రతిష్టాత్మక 'లే గ్రాండ్ రెక్స్' థియేటర్‌లో ప్రదర్శించనున్నారు. జనవరి 5న రాత్రి 9 గంటలకు బిగ్ స్క్రీన్‌పై ప్రత్యేక ఫార్మాట్‌లో గ్లింప్స్ ప్రదర్శన జరగనుంది. ఈ ఘనత సాధించిన తొలి ఇండియన్ సినిమాగా 'వారణాసి' చరిత్రలో నిలవనుంది. గ్లింప్స్‌ను బట్టి చూస్తే, సృష్టి ఆవిర్భావం నుంచి వారణాసి నగర ప్రాధాన్యత, యజ్ఞ యాగాలు, గుహలు, మణికర్ణిక ఘాట్, చిన్నమస్తా దేవి ఉగ్రరూపం వంటి అంశాలు కథలో కీలకంగా ఉండనున్నట్లు తెలుస్తోంది. అదే సమయంలో రామాయణంలోని ఒక ప్రధాన ఘట్టాన్ని కథలో మిళితం చేస్తూ, మహేష్ బాబు రుద్రుడిగా, రాముడిగా ద్వంద్వ అవతారాల్లో కనిపించనున్నారన్న టాక్ వినిపిస్తోంది.